# మనసుకు వున్న మూడు దోషాలు

బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# మనసుకు వున్న మూడు దోషాలు



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : జూలై, 2025
ప్రతులు : 2,000

వెల : రూ.60/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# విషయ సూచిక

1. మనసుకు ఉన్న మూడు దోషాలు .......................................... 3
2. కాలాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలి?........................ 19
3. యజ్ఞమయ జీవితం పొందాలి అంటే ఏ విధంగా ఉండాలి? . 27
4. దక్షిణామూర్తి సనకసనందనాదులకు చేసిన బోధ ................ 34
5.ధనానికి ఉన్న మూడు గతులు ........................................... 38
6.సమర్థులు - అసమర్థులు ................................................ 42
7. ఆత్మ దర్శనం కావాలంటే, మనం అనుకున్నది సాధించాలంటే......
మనలో ఎటువంటి శక్తులు ఉండాలి? ................................ 54

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 9) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 10) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 11) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 12)పంచకోశాలు | - | రూ.60/- |
| 13) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 14) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 15) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,

# మనసుకు ఉన్న మూడు దోషాలు

ఎవరైనా కష్టంలో ఉంటే జ్ఞాని వాళ్ళ బాధ పోగొట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. లోకంలో మానవులు కలుషితమైన మనసుతో చేసే పాపపు కర్మల వల్లే కష్టాలు తెచ్చుకుని దుఃఖం పొందుతున్నారు. ఈ సత్యం ఒక జ్ఞానికే తెలుసు. మరి జ్ఞానం పొందితేనే ఆ కర్మలన్నీ రహితం చేసుకోగలరని, ఆ జ్ఞానం, ధ్యానం చేస్తేనే వస్తుంది అని కూడా తెలుసు.

అందుకే ధ్యానం చేసి జ్ఞానం పొందితేనే మానవులు దుఃఖం నుంచి బయటపడతారని, ధ్యాన సాధన చేయమని చెప్తూ వుంటారు. ఈ సాధన గురించి చెప్తున్నప్పుడు కొంతమంది మీ మాట వినడానికి కూడా ఇష్టపడరు. కొంతమంది సాధనలో లోపాలు, లేదా గురువులో లోపాలు వెతుకుతుంటారు.

వాళ్ళు దేవుడికి, పరమాత్మకి, దేవతలకి మధ్య తేడాలు కూడా తెలియనంత అజ్ఞానంలో ఉంటారు. ఇంకొంతమంది తనకు తెలిసిందే సత్యం, తాను చేస్తున్నదే గొప్ప, ఇంక ఏదీ కూడా గొప్ప కాదు అనే అభిప్రాయంతో వినడానికి కూడా ఇష్టపడరు. ఇలా మీ చుట్టూ రకరకాల జనాలు ఉంటారు. ఇంత మంచి మార్గం చెప్తుంటే ఎందుకు వినట్లేదు అన్నది మొదట్లో మీకు అర్థం కాదు.

కానీ మీరు ధ్యాన సాధన చేస్తూ ఇలాంటి జ్ఞానవంతమైన విషయాలు తెలుసుకున్నప్పుడు, ఎదుటివాడు ఎందుకు ఎదగలేకపోతున్నాడు? ఎందుకు జ్ఞానం పొందలేక పోతున్నాడు? అన్నది అర్థమవుతుంది. మానవుడికి జ్ఞానం పెరగకుండా ఆపేవి మనసుకున్న మూడు దోషాలు అని మీకు ఉత్తరగీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

మరి ఏమిటా మూడు దోషాలు అన్నది తెలుసుకుందాం.

1) మల దోషం, 2) విక్షేపణ దోషం, 3) ఆవరణ దోషం.

ఈ మూడు దోషాల వల్లే విన్నా ఆచరణలో పెట్టుకోబుద్ధి కాదు,

వాళ్ళకి జ్ఞానం పెరగదు, సాధన చేయలేకపోతూ ఉంటారు. అందుకే ఎదుటి వాడిని బాగు చేద్దాము అనే ఆలోచన వచ్చిన ప్రతి వాళ్ళు, నేనెంత ఎదిగాను? అన్న ప్రశ్న వేసుకోవాలి. చెప్పడం చాలా సులువు, మరి చెపుతున్న ప్రతి విషయాన్ని నేను ఆచరణలో పెడుతున్నానా? లేదా? అన్నది విచారణ చేసుకుంటూ ఉండాలి.

విచారణే లేకపోతే నేను చేసిందంతా సరైనది అనుకుంటారు. అందుకే చెప్పే అర్హత నీకు వస్తే నువ్వు ఎంత కరెక్ట్‌గా ఉన్నావు? ఎంత పర్‌ఫెక్ట్‌గా ఉన్నావు? అన్నది ప్రతి క్షణం విచారణ చేసుకోవాలి. మరి ఈ దోషాల గురించి వివరంగా తెలుసుకుందాం.

**1) మలదోషం:-**

ఇది చాలా కలుషితమైన దోషం. అంటే గత జన్మలో పాప కర్మలు ఎక్కువ చేస్తే చెడ్డ సంస్కారాలు వస్తాయి. దీన్ని మలదోషము అని ఎందుకు అన్నారంటే? నిన్న తిన్న ఆహారం ఈవేళ మలంగా వెళ్ళిపోతుంది, ఈవేళ తిన్న ఆహారం రేపు మలంగా వెళ్ళిపోతుంది. అంటే రోజు పాపాలు చేస్తారు. తర్వాత వాటి ప్రభావం ఉంటుంది. మరి దీన్ని మలంతో ఎందుకు పోల్చారు అంటే! ఇది చాలా నీచాతి నీచమైన దోషం, పాప కర్మలు ఎక్కువగా ఉన్న దోషం.

అంటే హింస, మోసం చేయడం, దగా చేయడం, అవమాన పరచడం, దొంగతనం చేయడం, ఎదుటివాడిది బలవంతంగా లాక్కోవడం ఇటువంటివన్నీ పాప కర్మలే.

ఇలాంటి కర్మలు ఎక్కువగా చేస్తే ఈ జన్మలో కూడా వాళ్ళకి జ్ఞానం పొందే అర్హత ఉండదు. ఒకవేళ మీరు ప్రయత్నించినా వాళ్ళు వినడానికి కూడా ఇష్టపడరు అన్నది శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఉత్తర గీత ద్వారా తెలియజేశాడు. ఉత్తర గీత అనేది యుద్ధం అయిపోయాక శ్రీ కృష్ణుడు అర్జునుడికి రెండోసారి ఉపదేశించిన జ్ఞానం.

ఎటువంటి వారు ఈ ఆత్మజ్ఞానం వినడానికి, ఆచరించడానికి కూడా ఇష్టపడరో చెపుతూ ఈ మలదోషం గురించి చెప్పారు. ఇది చాలా కలుషితమైన దోషం అన్నారు. ఈ దోషం గత జన్మ సంస్కారాన్ని బట్టే వస్తుంది, ఇది ఐదు రకాలుగా ఉంటుంది అని చెప్పారు. మరి ఆ ఐదు రకాల మలదోషాల గురించి తెలుసుకుందాం.

**ఎ) అణుమలం:**

ఈ అణుమలం ఉంటే పరమాత్మ గురించి అస్సలు తెలుసుకోలేరు, చెప్పినా అర్థం చేసుకోలేరు. ఇప్పుడు ప్రపంచంలో 99% ఈ రకం జనమే ఉన్నారు.

హిందువులయితే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వరకు తెలుసుకున్నారు, ముస్లింలు మహమ్మద్ గురించి తెలుసుకున్నారు, క్రిస్టియన్లు జీసస్ గురించే తెలుసుకున్నారు. కానీ వీళ్ళని సృష్టించిన పరమాత్మ ఒకడు ఉన్నాడు అని వీళ్ళకి తెలియదు. పోనీ ఈ సృష్టిని సృష్టించిన వాడు ఒకడు ఉన్నాడు, ఆ పరమాత్మ యొక్క శక్తి వల్లే ఈ సృష్టి నడపబడుతుంది అని చెప్పినా వాళ్ళకి అర్థం కాదు, వినిపించుకోరు.

మీరేదో గొప్పగా చెప్తున్నారు, ఇప్పుడు కొత్త మత ప్రచారం చేయడానికి వచ్చారా? అని తిరిగి మనల్నే ఎగతాళి చేస్తూ ఉంటారు. అంటే వారి మనసుకి అణుమలం ఉంది, అణుమలం అంటే వాడు ఆ చెడ్డ సంస్కారంతోటే ఉన్నాడు. అంటే ఎంత ఎక్కువ చెడ్డ సంస్కారం ఉందో మనం అర్థం చేసుకోవచ్చు.

వీడికి పరమాత్మ గురించి తెలుసుకునే అర్హత ఇంకా రాలేదు అని అర్థం చేసుకోవాలి. ఎవరికైనా అర్థమవ్వకపోతే మీరు ఇంకా చెప్తూనే ఉంటారు. కానీ వాడికి అర్థం చేసుకునేంత సంస్కారం లేదు. వాడి గత జన్మ ఎంతో పాపిష్టి జన్మ, అందుకే చెప్పినా వినిపించుకోలేనంత హీన స్థితిలో ఉన్నాడు అని అర్థం చేసుకోవాలి.

**బి) కార్మిక మలం:**

ఈ కార్మిక మలం ఉన్నవాళ్ళు ఎక్కడైనా వేదాంత విషయాలు చెప్తుంటే

టాపిక్ డైవర్ట్ చేస్తారు, లేకపోతే నాకు పని ఉంది ఇప్పుడే వస్తాను అని లేచి వెళ్ళి పోతారు. వేదాల్లో ఈ ఆత్మజ్ఞానం, బ్రహ్మజ్ఞానమే ఉంది కాబట్టి వీటినే వేదాంత విషయాలు అని చెప్తారు.

ఆత్మ గురించి జ్ఞానం పొందితేనే మోక్షము అని చెప్పినా సరే వాళ్ళకి ఈ మాటలు నచ్చవు. మీరు చెప్తున్నంతసేపు వింటారు, కానీ వాళ్ళ పనులు మాత్రం మానరు.

ఇలాంటి వాళ్ళు కంఠస్త చేసి క్లాసులు చెప్పేస్తూ ఉంటారు. మరి ఆత్మజ్ఞానం గురించి చెప్తున్నప్పుడు వారి బుద్ధి దాని మీద నిలకడలేక ప్రక్కకు వెళ్ళిపోతూ ఉంటుంది. ఆ బుద్ధిని బట్టే మనిషి ప్రవర్తన ఉంటుంది. గొప్ప కోసం ఊరికే క్లాసులు చెపుతారు కానీ వీరి గత జన్మ సంస్కారం చాలా చెడ్డగా ఉంటుంది.

ఇంకొకటి గమనించండి చాలామంది ధ్యానం క్లాసుల్లో ధ్యానం చెప్తూ, చేయిస్తూ, అందరినీ ధ్యానంలో కూర్చోబెట్టి, వీళ్ళు బయట తిరుగుతారు. వీళ్ళకు కూడా సంస్కారం లేదు. ఏమన్నా అంటే మేము సీనియర్లము, మాకు ధ్యానం అవసరం లేదు, పత్రి గారు గతజన్మలో నీ ధ్యానం అంతా అయిపోయిందని చెప్పారు అంటారు. ధ్యానం అంతా అయిపోతే మళ్ళీ ఎందుకు పుడతారు?

నేను ఇంకా ఎదగాలి, సృష్టి రహస్యాలు ఇంకా తెలుసుకోవాలి, ఇంకా నాకు ధ్యానం కావాలనే తపన మీ హృదయంలో ఉంటే! ఒక్క క్షణం వృధా చేయకుండా ధ్యానంలోనే ఉంటారు. మీలో ఈ తప్పు ఉంటే సరి చేసుకోవాలి, ధ్యానం తెలియకుండా తప్పు చేస్తే తప్పు కాదు కానీ ధ్యానం తెలుసుకుని తప్పు చేస్తే అది పరమ తప్పు.

వేదాంత విషయాలు మాట్లాడినప్పుడు ఎంతో ఆసక్తిగా వినాలి. ఇంకా నేను తెలుసుకోవాల్సింది ఉంది, అందుకే నాకు ప్రకృతి వినిపించేలా చేస్తుంది అని అర్థం చేసుకోవాలి. చెప్పేవాడు చిన్నవాడు అవనివ్వండి, పెద్దవాడు అవనివ్వండి ఈరోజు ఆ విషయాలు చెప్పగలిగే శక్తి వాడికి ఉంది అంటే వాడి గత జన్మ ఎంతో గొప్పది. వేదాంత విషయాలు ఎవ్వరు చెప్పినా వినగలిగే

అంత సంస్కారం మీకు వుండాలి. వినను అంటే మీకు అహంకారం వున్నట్టే!

గమనించండి మీరు చెప్పే వేదాంత విషయాలు, సొంత అనుభవాలు కాదు. నేను ఇలా చేశాను, ధ్యానంలోకి వచ్చాక నాకు అది వచ్చేసింది, ఇది వచ్చేసింది అని చెప్పడం వేదాంత విషయాలు కాదు. మీ మహత్యాలు చెప్పాల్సిన అవసరం లేదు, కానీ ఆ పరబ్రహ్మం గురించి మీకు ఏదైనా తెలిస్తే, ఏ పుస్తకంలోనైనా చదివితే అవి చెప్పాలి. అప్పుడు మీకు సాధన బాగా కుదురుతుంది.

మరి వేదాంత విషయాలు చెప్తున్నప్పుడు మీ బుద్ధి ప్రక్కకి వెళ్ళింది అంటే మీ గతజన్మ వాసనలు ఇంకా వదలలేదు అని అర్థమవ్వాలి.

**సి) మాయక మలం:**

మాయక మలము అంటే గాఢమైన అజ్ఞానం. శ్రీ కృష్ణ భగవానుడు ఎంత బాగా చెప్పాడో చూడండి. ఇది మామూలు అజ్ఞానం కాదు, చాలా గాఢమైన అజ్ఞానం. లోకంలో అందరూ విగ్రహారాధన చేస్తుంటే పత్రి గారు వచ్చి విగ్రహారాధన కాదు ఆత్మారాధనే చేయాలి, ఎందుకు అంటే ఆత్మే భగవంతుడు కాబట్టి.

ఎన్ని చెప్పినా ధ్యానులు కూడా ఇంకా విగ్రహారాధన వదలట్లేదు అంటే ఎంత అజ్ఞానంలో ఉన్నారో చూడండి. ఎన్నో క్లాసుల్లో శిలల కన్నా, ఖనిజాల కన్నా, వృక్షాల కన్నా, భూచరాలు, జలచరాల కన్నా మానవుడికే సంపూర్ణంగా చైతన్యం ఉంది, మానవ జన్మే చిట్ట చివరి దశ అని చెప్తున్నా ఇంకా ఆ విగ్రహారాధన వదలకుండా అదే పట్టుకుంటున్నారంటే ఇది గాఢమైన అజ్ఞానమే.

అందుకే ఈ గాఢమైన అజ్ఞానంతో ఉన్న వాళ్ళకి పరమాత్మను తెలుసుకునే అవకాశం ఉండదు. అందుకే వారు ధ్యానం చేస్తూ దేహ లాభాలు, మానసిక లాభాల గురించే ఆలోచిస్తారు. గురువు నువ్వే భగవంతుడివని చెప్పినా అర్థం కాదు. మనసు అనే మాయకు వశమవుతున్నారని, ఆ మాయను తొలగించే మార్గమే ధ్యానము అని గురువు చెప్పినా బుర్రకి ఎక్కట్లేదంటే గత జన్మ సంస్కారం

వల్లే అని తెలుసుకోవాలి.

**డి) మాయయే మలం:**

"అహం బ్రహ్మాస్మి" అంటే నేనే భగవంతుడ్ని, "తత్వమసి" అంటే నీవు కూడా అదే అయి ఉన్నావు, "సర్వం ఖల్విదం బ్రహ్మ" అంటే సృష్టి అంతా బ్రహ్మమయమే, ఆయన లేనిది, ఆయన కానిది, ఆయనకి తెలియనిదంటూ ఏదీ లేదు. అంతా నారాయణ తత్వమే, ఆ పరబ్రహ్మ స్వరూపమే, ఆ చైతన్య శక్తే ఉంది అని వేదాలు, ఉపనిషత్తులు చెప్పాయి.

అన్ని చెప్పినా మళ్లీ మాయకి వశమై అజ్ఞానంలో కూరుకుపోతూ ఎదుటివాడిని మోసం చేస్తున్నారు, అబద్దాలు చెప్తున్నారు, మాయ చేస్తున్నారు. ఎందుకంటే "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని విన్నారు కానీ వారి బుద్ధి దాని మీదకి వెళ్ళట్లేదు. నేను పొరపాటు చేసినా, తప్పు చేసినా పరమాత్మకు తెలియకుండా ఉండదు. మళ్ళీ నేను పాపంలో కూరుకు పోతాను అనే ఎరుక లేదు. మరి సాధన చేస్తున్నా ఎందుకు ఇలా ఉన్నారు అంటే? లాభాల కోసం. వాళ్ళ జీవితంలో ఎప్పటికీ మార్పు రాదు.

గమనించండి ధ్యానం లోకి వచ్చిన వాళ్ళకి రెండు దారులున్నాయి. లాభాలు ఆశించి, ఫలితాలు ఆశించి, ప్రపంచంలో గొప్పగా బ్రతకాలి అని సాధన చేస్తే రాక్షస మనస్తత్వం. లేదు సృష్టి అంతా పరమాత్మమయమే కానీ నా మనసు మాయకి వశమవ్వడం వల్ల అన్నీ వేరు వేరుగా కనిపిస్తున్నాయి అని తెలుసుకోవాలి. అందరూ ఒకటిగా కనిపించాలంటే ఈ మాయ తొలగాలి, ఈ మాయని తొలగించుకునే శక్తి ఒక్క ధ్యానానికే ఉంది అని తెలుసుకున్నప్పుడు బాగుంటుంది కానీ ఆచరణలోకి వచ్చేటప్పటికి నేను, నాది వదలట్లేదు. ఈ మాయ తొలగించుకునే మార్గం ధ్యానమే అని తెలుసుకుని సాధన చేసి, విచారణ చేస్తే పాపకర్మలు చేయ్యరు. మరి ఆ మాయని తొలగించుకోకపోతే మనసు పాపకర్మల వైపుకు వెళ్ళిపోతుంది, ఈ మనసుకున్న మాయనే మాయక మలం అంటారు.

**ఎఫ్) తిరోదాన మలం :**

అంటే సత్యమైన పరమాత్మని అసత్యం అనుకుంటాడు, అసత్యమైన దాన్ని సత్యమని భావిస్తారు. అందుచేత సత్యమైన పరమాత్మ లోపల ఆత్మగా ఉన్నా అసత్యాన్ని అంటే విగ్రహంలోనే దేవుడు ఉన్నాడని పూజలు చేస్తారు, బంధాల మీద ప్రేమ చూపిస్తారు. ఈ శారీరక బంధాలన్నీ అసత్యమే, పరమాత్మతో బంధమే శాశ్వతం అని తెలుసుకోవాలి. కానీ ఏదైనా వస్తే ధ్యానమైనా ఆపుతారు కానీ ప్రాపంచికమైన పనులు ఆపరు.

అసత్యమైన శరీరం కోసం, అసత్యమైన బంధాల కోసం, అసత్యమైన సృష్టి కోసం, అసత్యమైన మనస్సు కోసం పాపాలు చేస్తున్నారు. అసత్యము అంటే లేదు అని కాదు, శాశ్వతంగా ఉండనిది ఏదైనా అసత్యమే. అసత్యం అనగానే మరి కనబడుతుంది కదండీ అని అడగొచ్చు. అది తాత్కాలికంగా కనిపిస్తుంది కానీ శాశ్వతంగా ఉండదు, శాశ్వతంగా ఉండేది ఆత్మ ఒక్కటే. శరీరము, మనసు, సృష్టి, బంధాలు ఇవన్నీ అసత్యమే.

అందుకే శాశ్వతమైన, సత్యమైన పరమాత్మ కనబడట్లేదు కాబట్టి ఉన్నాడో? లేదో? అనుకుంటూ పాపాలు చేస్తున్నారు. ఇదే తిరోదానమలం.

మీకు ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఎక్కువ ఉందా? ఆత్మ మీద ఆసక్తి ఉందా? అని ఎప్పటికప్పుడు ఒక జ్ఞాని విచారణ చేసుకుంటూ వుంటాడు. మీకు ఇంకా ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఉంది అంటే ఈ తిరోదానమలం ఉన్నట్టే.

ఇప్పుడు అందరికీ కూడా గొప్పగా ఎదగాలని కోరిక ఉన్నా, ప్రాపంచిక అవసరాలన్నీ సమకూరాయా? లేదా? అనే దాని మీద దృష్టి పెడుతున్నారు. జ్ఞానం పెంచుకున్న వాడికి అవసరాలన్నీ ప్రకృతి తీరుస్తుంది.

అలా జ్ఞానికి ప్రకృతి అన్నీ సమకూరుస్తున్నప్పుడు మీరు చేయాల్సింది జ్ఞానం పెంచుకోవడం. కానీ ఈ తిరోదానమల దోషం వల్ల ప్రాపంచికమైనవి నేను సంపాదించుకోకపోతే ఎలా? అని వాటి వెనకాలే పరిగెడుతున్నారు.

జ్ఞానాన్నైనా వదులుకుంటున్నారు కానీ సంపాదన మాత్రం వదలలేకపోతున్నారు.

అంటే ఈ పంచమలాల వల్లే గాఢమైన అజ్ఞానంలో వుండి పరమాత్మను తెలుసుకోరు, ప్రయత్నమే చేయరు.

ధ్యానం ఎక్కువ చేస్తున్నవారే తెలుసుకుంటున్నా, వింటున్నా, అంటున్నా ఆచరణలోకి వచ్చేటప్పటికి యధా ప్రకారంగా పూర్వం ఉన్నట్టే ఉంటున్నారు, అంటే మామూలు వ్యక్తుల పరిస్థితి ఏమిటి? ఇవన్నీ ఒక జ్ఞాని ఎందుకు తెలుసుకోవాలి అంటే ఎదుగుదల కోసం.

మీరు ఎదుగుతున్నప్పుడు సాధన ఒక్కటే ఆటంకం అనుకుంటూ ఉంటారు. కానీ ఇవన్నీ తెలుసుకున్నప్పుడు ఇన్ని దోషాలు నాలో ఉంటే నా ఎదుగుదల తగ్గిపోతుంది అని ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలి.

ఎవరికీ దోషాలు లేకుండా ఉండవు. దోషాలు ఉంటేనే మానవ జన్మలో అవి అనుభవిస్తూ, పాఠాలు నేర్చుకుంటూ, ఇంకొక జన్మ వచ్చేటప్పటికీ ఈ జన్మలో దోషాలన్నీ తొలగించుకుంటూ సాధనతో ముందుకు వెళ్ళాలి. ఈ స్థితిలో, ఈ జన్మలో సాధన కంటే తర్వాత జన్మలో సాధన ఇంకా గొప్పగా సాగాలి, జ్ఞానం ఇంకా గొప్పగా పెరగాలి.

మరి శ్రీ కృష్ణ భగవానుడు ఉత్తరగీతలో ఈ పంచమలాల గురించి చెప్తూ, సాధన చేస్తున్నా ఈ పంచమలాల వల్ల, గతజన్మ దోషాల వల్ల మానవుడు ఎదగకుండా పోతున్నాడు అని చెప్పారు. మరి ఈ మలదోషం ఎలా పోతుంది అంటే? శ్రవణం ద్వారా పోతుంది. ఎక్కువగా మీకు నచ్చినా, నచ్చకపోయినా ఎవరైనా ఈ విషయాలు మాట్లాడుతుంటే ఆసక్తిగా వినాలి.

అందుకే ప్రకృతి, ముందు మీ ప్రవర్తన చూస్తుంది, ప్రకృతి ఒక పెద్ద ఎగ్జామినర్. అది తెలుసుకోవాలి. మీకు ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి ఉందా? ఆధ్యాత్మిక విషయాల మీద ఆసక్తి ఉందా? అని గమనించి మీకు ప్రాపంచిక విషయాల్లోనే కూరుకుపోతే మాయకి వశం చేస్తుంది. లేదా, మీరు ఆధ్యాత్మిక విషయాల మీద ఆసక్తి చూపిస్తూ, బలవంతంగా అయినా

వేదాంత విషయాలు వింటే... ఝుంకారనాదం వినగా వినగా కీటకం భ్రమరంలా మారినట్టు, ఈ పంచమల దోషాలు ఉన్నా.. వేదాంత విషయాలు శ్రవణం చేయగా చేయగా మీరు కూడా మారి, ఈ ధ్యానం మీద, జ్ఞానం మీద ఆసక్తి పెరిగి పాప కర్మలన్నీ వదిలేస్తారు.

ఎందుకు అంటే గత జన్మ పాపమే వాసనల రూపంలో మలదోషంగా ఈ జన్మకి వచ్చింది. దానివల్లే పరమాత్మ మీదకి దృష్టి పోవట్లేదు. మరి ఈ జన్మలో మళ్ళీ పాపాలే చేస్తే తరువాత జన్మలో కూడా ఈ మలదోషం మీ కూడానే వస్తుంది. అందుకే ఈ జన్మలో పాపాలు చేయకూడదు, పుణ్యాలు చేయాలి. కానీ ఎలా చేయాలి? భగవంతుడు మీకు అవకాశం ఇస్తున్నాడు. ఈ పుణ్యఫలం ఆయనదే! అని ఏ కోరిక లేకుండా నిష్కామ కర్మ చేయాలి. ఈ నిష్కామ కర్మ ఎప్పుడైతే చేస్తారో పుణ్య కర్మ కూడా మీకు రాదు. ఆ కర్మఫలం అనుభవించడానికి మళ్లీ రానక్కర్లేదు. అందుకే వశిష్టుల వారు గత జన్మ సంస్కారాలు, వాసనలు తొలగించుకోవాలంటే ఈ జన్మలో పురుష ప్రయత్నం ఎక్కువగా ఉండాలి అన్నారు.

అంటే ఎక్కువ సాధన చేస్తూ.. వేదాంత విషయాల మీద ఆశక్తి పెంచుకుంటూ, పాపకర్మలు మాని, పుణ్య కర్మలు నిష్కామంగా చేస్తూ ఉన్నప్పుడు ఈ మల దోషాన్ని ఈ జన్మలోనే తొలగించుకోవచ్చు అని శ్రీ కృష్ణుడు ఉత్తరగీతలో చెప్పడం జరిగింది.

**2. విక్షేపణ దోషం:-**

అంటే ఈ మనసు బాహ్యేంద్రియాలతో ప్రాపంచిక విషయాలు, దృశ్య విషయాలు సేకరిస్తుంది. అంటే కన్ను చూస్తుంది, చెవి వింటుంది, నోరు మాట్లాడుతూనే ఉంటుంది, ఈ విషయాల వెంట మనస్సు పోయి అక్కడ విషయాలన్నీ గ్రహించి మనసుని చంచలావస్థలో ఉంచుతుంది. అంటే అన్నీ ఒకే మానవునికి ఉండవు అని శ్రీ కృష్ణుడు చెప్పిన ఉదాహరణ చూద్దాం.

**ఎ) మిడతకి నయనేంద్రియ లోపం:-**

మిడత దీపపు వెలుతురుని చూసి పండు అనుకొని అగ్నిలో పడి

దహించుకునిపోతుందట. అలా మిడత నయనేంద్రియ లోపం వల్ల మరణిస్తుంది.

**బి) లేడికి శ్రవణేంద్రియ లోపం:-**

లేడికి సంగీతం అంటే చాలా ఇష్టం. అందుకే బోయవాడు సంగీతాన్ని వినిపించి అది వచ్చే చోట దాన్ని వలవేసి పట్టేస్తాడు. ఆ ఇంద్రియ లోపం వల్ల లేడి మరణిస్తుంది.

**సి) చేపకి రసేంద్రియ లోపం:-**

చేపకి జిహ్వాచాపల్యం ఉంటుంది. అందుకని ఎరవేసి చేపని పట్టేస్తూ ఉంటారు. అలా రసేంద్రియ లోపం వల్ల చేప మరణిస్తుంది.

**డి) ఏనుగుకి స్పర్శేంద్రియ లోపం:-**

అందుకే ఏనుగుని మావటివాడు మంచె వేసి, మంచె అంటే గొయ్యి తవ్వి, దాని మీద వెదురు వేసి, దాని మీద గడ్డి వేసి, ఆడ ఏనుగుతో అరిపిస్తాడు. అక్కడ ఆడ ఏనుగు ఉందనుకుని పరుగు పరుగున వచ్చి ఆ మంచెలో పడి కూరుకుపోయి బోయవాడికి దొరికిపోతుంది.

**ఇ) తుమ్మెదకి ఘ్రాణేంద్రియ లోపం:-**

తుమ్మెదకి మంచి వాసన వస్తే ఆగలేదు. అది ఏ పువ్వుల మీద వాలినా బ్రతకొచ్చు కానీ సంపెంగ పువ్వు మీద వాలితే మరణిస్తుంది. అలా ఘ్రాణేంద్రియ లోపం వల్ల తుమ్మెది మరణిస్తుంది.

ఇలా ఒక్కొక్క జీవి ఒక్కొక్క ఇంద్రియ లోపం వల్ల మరణిస్తుంది. కానీ మానవుని మనసుకు వున్న ఐదు ఇంద్రియాల లోపం వల్ల నిత్యము కష్టాలు, బాధలు పడుతూనే ఉన్నాడు. ఇలా మనసు ఇన్ని ఇంద్రియాలకి బానిసై చంచలావస్థలో ఉండడం వలన ఎప్పుడూ సాధనకి ఇష్టపడదు.

ఎందుకంటే కళ్ళు విప్పి ఇంద్రియాల ద్వారా సేకరించిన విషయాలన్నీ కూడా ధ్యానంలో గుర్తొచ్చి ధ్యానం కుదరదు. ఎన్ని గంటలు కూర్చున్నా అవే విషయాలు గుర్తుకు వస్తాయి. అందుకే అటువంటి వాళ్ళకి మనసు చంచలత్వం నుంచి నిశ్చలత్వంలోకి రావాలి అంటే! ముందు గురువు దగ్గర నిత్య, అనిత్య వస్తు వివేక జ్ఞానం పొందాలి, అప్పుడు గాని ధ్యానం కుదరదు.

గురువులు నువ్వు అనిత్యమైన వాటి వెనకాల పడినప్పుడు మళ్లీ జన్మ ఉంటుంది, జన్మ ఉంటే దుఃఖం ఉంటుంది అని చెప్తారు. అదే నిత్యమైన, సత్యమైన ఆత్మ కోసం ప్రయత్నించినప్పుడు జన్మలేని స్థితికి వెళ్తావు అని కూడా చెప్తారు. అందుకే ముందు సాధకులకి నిత్య అనిత్య వస్తు వివేకం ఉండాలి అని శంకరాచార్యులు వారు కానీ, శ్రీ కృష్ణ భగవానుడు కానీ చెప్పడం జరిగింది.

అలాగే మీరు కూడా ఎవరికైనా ధ్యానం చెప్పాలి అంటే ముందు సృష్టికర్త సృష్టించిన సృష్టి అంతా అనిత్యమే! సృష్టికర్తే నిత్యము, సత్యము అని చెప్పాలి. అవకాశం లేనప్పుడు అంటే సాధన తెలియనప్పుడు, భగవంతుడు ఎవరో తెలియనప్పుడు, అనిత్యమైన విగ్రహారాధన చేశారు. కానీ గురువు ద్వారా భగవంతుడు ఎవరో తెలుసుకున్నాక  నిత్యమైన, సత్యమైన ఆత్మ వెనకాలే పడాలి.

మరి బాల్య దశ దాటి, వృద్ధాప్య దశకు వెళ్లే వరకు ఎవరైనా ఆత్మే భగవంతుడు అని చెప్పినా కూడా వాళ్లకు నమ్మకం కలగదు. అంటే వాళ్లు ఇంకా వృద్ధాత్మ దశకు రాలేదు అని అర్థం చేసుకోవాలి. మరి అలాంటి వాళ్ళకి మనసు చంచలావస్థలో ఉన్నంతసేపు సాధన కుదరదు.

మరి చంచలమైన మనసును నిశ్చలం చేయాలి అంటే ముందుగా సాధకుడు గురువు చెప్పిన విషయాల మీద నమ్మకము, విశ్వాసము ఉంచి తన జీవితంలో అవి ఆచరణలో పెట్టుకోవాలి. అలా పెట్టుకున్న వాడు నిశ్చలమైన మనసుతో సాధన చక్కగా చేయగలడు. అలా విక్షేపణ దోషాన్ని తొలగించు కోగలడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే బాహ్యేంద్రియాలు వెంట పరిగెట్టిన మనసు అన్ని విషయాలు సేకరించి చంచలావస్థలోకి వెళ్తుంది, అటువంటి చంచలావస్థలో సాధన కుదరదు. మరి మనసు ఆ చంచలావస్థ నుంచి నిశ్చలావస్థకు రావాలి అంటే నిత్య, అనిత్య వస్తు వివేకం ఉండాలి. అంటే నిత్యమైనది ఏమిటి? అనిత్యమైనది ఏమిటో? తెలుసుకుని, సత్యమైన పరమాత్మ

వైపుకు ప్రయాణం సాగించినప్పుడు మనసు ఈ చంచలావస్థ నుంచి నిశ్చలావస్థకు వస్తుంది. అప్పుడు సాధన బాగా కుదురుతుంది.

**3) ఆవరణ దోషం:-**

అంటే అసత్యాన్ని సత్యంగా భావించటం. మీరు సాధన చేశాక ఆత్మే భగవంతుడు, అది నేనే అయి ఉన్నాను అని తెలుసుకున్నారు. కానీ అది తెలుసుకోకముందు శరీరం నేను, మనసు నేను అని రకరకాల భావాలతో ఉండేవారు.

అంటే శరీరం కనబడుతుంది కాబట్టి, ఎంతసేపు ఈ శరీరానికే ప్రాముఖ్యం ఇచ్చారు. అంతవరకు ఆత్మ అంటే ఏమిటో కూడా తెలియదు. అందుకే కొన్ని జన్మలు శరీరానికే ప్రాముఖ్యం ఇచ్చి, మరి కొన్ని జన్మలు మనసుకు ప్రాముఖ్యం ఇచ్చి గడిపారు.

ఆవరణ దోషం అంటే ఆత్మ పైన కప్పిన తొడుగులను ఆత్మ అనుకోవడం.. ఒక కత్తి ఉంటే దానిపై తొడుగు దూరానికి కత్తిలాగే కనిపిస్తుంది. మరి అది తొడుగే కానీ కత్తి కాదు అని తెలుసుకోవాలి.

కానీ ఆధ్యాత్మిక మార్గంలోకి రాకముందు జ్ఞానం లేక, ఈ విషయాలు తెలియక శరీరం గురించి ఆలోచించారు. కానీ ఇప్పుడు ఈ శరీరం ఆత్మ పైన తొడుగు అని తెలుసుకున్నారు. మరి ఇంకా లోతుల్లోకి వెళ్ళినప్పుడు ఆత్మపైన ఈ పంచ కోశాలు తొడుగుల్లాగా ఉన్నాయి. అవి ఏమిటి అంటే!

1. అన్నమయ కోశం, 2. ప్రాణమయ కోశం, 3. మనోమయ కోశం, 4. విజ్ఞానమయ కోశం, 5. ఆనందమయ కోశం

ఆత్మ జ్ఞానవంతమైనది, ఈ ఐదు తొడుగులు అజ్ఞానవంతమైనవి. అజ్ఞానం అంటే వీటికి జ్ఞానం ఉండదు. అవి యధాతథంగా వాటి పని అవి చేసుకుంటాయి. కానీ ఆత్మ నిత్యమైనది, సత్యమైనది, చైతన్యవంతమైనది, జ్ఞానవంతమైనది, ఆనందమే! దాని స్వరూపం. ఇవి ఆత్మకి ఉన్నాయి కానీ పైనున్న పంచకోశాలకి లేవు.

ఎందుకు లేవంటే? ఇప్పుడు మీ శరీరానికి ఏదో రోగం వచ్చింది.

అంటే ఇక్కడ ఏ శరీరానికి వచ్చింది? ఏ కోశానికి వచ్చింది? అన్నమయ కోశానికి వచ్చింది. అలా రోగం వచ్చినప్పుడు ఎంతో బాధ పడతారు. చిన్ననొప్పి వచ్చినా బాధగానే ఉంటుంది.

అలాగే మీకు ఆకలేస్తూ ఉంటుంది. మరి ఏ కోశస్థితికి ఆకలి వేస్తుంది అంటే? ప్రాణమయ కోశానికి ఆకలి దప్పులు ఉంటాయి. మరి మీకు కోపం, ద్వేషం వచ్చింది. ఈ కోపం, ద్వేషం దేనికి అంటే? మనసుకి. ఇవి మనోమయ కోశానికి వుంటాయి. మరి ఇలా చెయ్యాలి, ఇలా చేయకూడదు అని నిశ్చయించేది బుద్ధి, ఇది విజ్ఞానమయ కోశానికి వుంటుంది. మరి పగలంతా ఎలా ఉన్నా రాత్రి అయ్యేటప్పటికి గాఢంగా నిద్రపోతూ ఉంటారు. ఇది ఆనందమయ కోశ స్థితి. అంటే ఇవేవీ ఆత్మవి కాదు ఈ పంచకోశాలవి అని తెలుసుకోవాలి.

రోగాలు, బాధలు అన్నమయ కోశానివి, ఆకలి దప్పులు ప్రాణమయ కోశానివి, రాగద్వేషాలు మనోమయ కోశానివి, నిశ్చయించేది విజ్ఞానమయ కోశం, గాఢ నిద్రావస్థ ఆనందమయ కోశం. అంటే ఈ ఐదు చూసుకుంటే పనులు చేస్తాయి కానీ జ్ఞానం ఇవ్వలేవు. శరీరానికి ఉండే ఇవన్నీ దైనందిక జీవితంలో పనులు చేస్తూ, కర్మ ఫలాలు అనుభవిస్తాయి.

ఆత్మ వల్లే ఈ ఐదు కోశాలకి కూడా శక్తి వస్తుంది, వాటి పనులు అవి చేసుకుంటున్నాయి, కానీ వాటి వల్ల ఆత్మ శక్తివంతం కావట్లేదు. కానీ అజ్ఞానంలో ఉన్న మానవుడు ఈ కోశాలే తాననుకుంటున్నాడు. ఇక్కడ బాగా గ్రహిస్తే ఆత్మ నేనైనప్పుడు ఈ పంచ కోశాలు ఆత్మ తొడుగులు అని తెలుస్తుంది. ఇప్పుడు చూడండి చెయ్యి పని చెయ్యికుంది, కాలి పని కాలికుంది, నోటి పని నోటికుంది, చెవుల పని చెవులకు ఉంది. కళ్ళ పని కళ్ళకి ఉంది. ఇలా శరీరంలో దేని పని అది చేస్తుంది.

అలాగే ఈ ఐదు కోశాలు ఐదు పనులు చేస్తున్నాయి, అవి ఆత్మ మీద ఉన్న తొడుగులే కానీ వీటికి కూడా శక్తినిచ్చేది ఆత్మ అని మనం ఎప్పుడైతే

తెలుసుకుంటామో ఆ తొడుగుల భ్రాంతిలో నుంచి బయటపడి ఆత్మభ్రాంతిలో ఉంటాం.

తొడుగుల మీద భ్రాంతి అంటే కొంతమంది ఆ శరీరం అందంగా ఉండాలి అని దానికి ఎన్నో అలంకారాలు చేస్తున్నారు, అలాగే కొంతమంది ఆరోగ్యానికి మంచిది ఈ ఆహారమే తినాలి, ఆ ఆహారమే తినాలి అనుకుని కేవలం తిండి మీదే ధ్యాస పెడుతున్నారు.

మరి కొంతమంది వాడు శత్రువు, వీడు మిత్రుడు అనుకుంటూ రాగద్వేషాలతో రగిలిపోతారు. మరి కొంతమంది గొప్ప గొప్ప పనులన్నీ నేనే చేస్తున్నాను అని అనుకుంటారు. ఇంకొంతమంది ఈ సంసారము, పిల్లలు, బాధలు పడుతూ.. నాకు నిద్రపోయినప్పుడే పరమశాంతి, మెలుకువగా ఉంటే అన్నీ బాధ్యతలే అనుకుంటూ.. ఆ నిద్రా సుఖమే గొప్ప సుఖము అనుకుంటూ ఉంటారు.

మీరు ఈ ప్రపంచం వైపు చూస్తే ఈ ఐదు రకాల జనాలే ఉంటారు. అంటే అన్నమయ కోశ స్థితిలో, ప్రాణమయ కోశ స్థితిలో, మనోమయ కోశ స్థితిలో, విజ్ఞానమయ కోశ స్థితిలో, ఆనందమయ కోశ స్థితిలో ఉంటారు. కానీ ఎప్పుడైతే గురువు ద్వారా విని శ్రవణం చేసి పదేపదే మననం చేసుకుంటారో అప్పుడు భూమ్మీద నిత్యమైనవేంటి? అనిత్యమైనవేంటి? సత్యమైనది ఏంటి? అసత్యం ఏంటి? అన్నది తెలుసుకున్న రోజున పంచ కోశాలు నేను కాదు నేను ఆత్మని అని అర్థమవుతుంది.

ఈ పంచ కోశాలు అనే  తొడుగులు ఎందుకు వేసుకుని వచ్చారు అంటే? సాధన చేయడానికి. ఈ ఐదు తొడుగులు అవసరం కాబట్టి ఒక్కొక్క కోశానికి ఒక్కొక్క పని అప్ప చెప్పి ఆత్మ నిశ్చలంగా ధ్యానం చేస్తుంది. ఈ శరీరంతో విశ్వశక్తి పొందుతూ ఉంటుంది. విశ్వశక్తి లోపించిన వాడు చంచలావస్థలో ఉంటాడు. ధ్యానం ద్వారా విశ్వశక్తి అపారంగా తీసుకున్నవాడు అద్భుతమైన శక్తివంతుడు అవుతాడు.

ఎన్ని సమస్యలు ఉన్నా, ఎన్ని బాధలు ఉన్నా ఇవన్నీ నా కర్మ ఫలాలే అనుకుంటాడే కానీ ఎవరిమీద కోపం ఉండదు, ఎవరిని నిందించడు, తన సాధన తను చేస్తాడు.

మరి స్వాధ్యాయం ద్వారా విషయ సేకరణ చేసుకుంటూ అనుభవం లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాలి అంటే సాధన తప్పకుండా ఉండాలి. మన మనసుకి కానీ, బుద్ధికి కానీ స్వీకరించే గుణం ఉంది. దానిని విచారణ చేసి విజ్ఞానవంతంగా తయారు చేయాలి.

ఇప్పుడు మీరే ఉన్నారు, ఒక పుస్తకం గంటలో చదవగలిగే శక్తి మీకు లేదు. 10 నిమిషాలు చదివాక మీ బుర్ర వేడెక్కిపోయి వెంటనే పుస్తకం ప్రక్కన పెడతారు. నేను గంట చదవాలి అనుకుంటూ కూర్చోగలిగే శక్తి మీ బుద్ధికి లేదు, కాబట్టి సాధన చేసి మనసుకి, బుద్ధికి, శరీరానికి అన్నింటికీ కూడా శక్తిని పెంచాలి.

నువ్వు ఆత్మవైనా తొడుగులే నువ్వు అనుకోవడం ఆవరణ దోషము. తొడుగులన్నీ నశిస్తాయి. నువ్వు నశించవు అని గురువులు పదే పదే బోధించారు. ఎన్ని బోధలు విన్నా, ఎంతలా విన్నా మళ్ళీ  జారిపోతూ శరీరం నేను అనే స్థితిలోనే ఉండిపోతారు.

అలా ఉండిపోయినన్నాళ్లు మనసు చంచలావస్థలోనే ఉంటుంది కానీ నిశ్చలము, నిర్మలము కాదు. ఎందుకు కాదు అంటే రాగద్వేషాలు వదలవు, శోక మోహాలు వదలవు. ఆ నిశ్చలావస్థలో ఉండి సాధన చేస్తున్నప్పుడు మాత్రమే నేను ఆత్మను, అందరూ ఆత్మ స్వరూపులే, నేనేమీ చేయట్లేదు నా చేత చేయించబడుతుంది అన్నది అర్థమవుతుంది.

నేనే చేస్తున్నాను అనుకుంటే నీకు ఇంకా ఆవరణ దోషం పోలేదు. నన్ను వాడు విమర్శిస్తున్నాడు అంటే ఇంకా ఆవరణ దోషం పోలేదు. ఇవన్నీ కూడా మనసు యొక్క, బుద్ధి యొక్క స్థితిగతులు. ఈ స్థితిని మార్చుకోవాలి అంటే సరియైన సాధన చేసి  మనోమయ కోశస్థితి, విజ్ఞానమయ కోశ స్థితి

దాటాలి.

ఈ రెండు స్థితులే చాలా కష్టం. శరీర పోషణ, ఆకలి దప్పులు బాగానే తీర్చుకోవచ్చు. కానీ మనసు స్థితి మనోమయ కోశం, బుద్ధి స్థితి విజ్ఞానమయ కోశం దాటడం చాలా కష్టం. పడుకున్నప్పుడు ఆనందం వస్తుంది కానీ కళ్ళు తెరిచాక కూడా అదే ఆనంద స్థితిలో ఉండాలి అంటే! ఈ జనమూ మాయే, వీళ్ళ మాటలూ మాయే, అన్నీ మాయే, ఏదీ సత్యం కాదు అని అనుక్షణం ఎరుకతో ఉన్నప్పుడు మీరు ఆనందమయ కోశ స్థితిని కూడా దాటి ఆత్మస్థితికి వెళ్లగలుగుతారు. అలా అన్ని స్థితిలు దాటి ఆత్మస్థితిలో ఉంటే దైవాలు కాగలరు.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

# కాలాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలి?

మీరు ఎన్నో విషయాలు తెలుసుకున్నా, తెలుసుకోవాల్సింది ఇంకా ఉంటుంది. అని ఒక్కొక్కసారి చిన్న చిన్న విషయాలను ప్రక్కన పెట్టి ముందుకు వెళ్ళిపోతూ ఉంటారు. కానీ ఆ చిన్న విషయాలే మీ జీవితంలో ఒక్కొక్కసారి ఎదగకుండా చేస్తూ ఉంటాయి.

అందుకే ఒక జ్ఞాని ఎప్పుడూ కూడా నేను ఎదుగుతున్నానా? ఏదైనా లోటు ఉందా? అని విచారణ చేసుకోవాలి. మరి నేను ఇంకా భూమిమీద ఉన్నాను అంటే నేర్చుకోవాల్సింది ఉంది, నేర్చుకోవాలి అని ఎప్పుడూ అనుకుంటూ ఉండాలి. అప్పుడే మీకు ఎదుగుదల వస్తుంది.

పశువులకు మనసు ఉండదు. ఒక్క మానవుడికే మనసుతో పని చేసే శక్తి ఉంది. కాబట్టి మానవ జన్మ వచ్చాకే ప్రతీ క్షణము ఆనందంగా గడపాలి అని కోరుకుంటారు.

మరి ఎవరు ప్రతి క్షణము ఆనందంగా గడపగలరు అని విచారణ చేసుకుంటే? ఎవరైతే ప్రతిక్షణాన్ని సద్వినియోగం చేసుకుంటారో అటువంటివారు ప్రతిక్షణం ఆనందంగా జీవిస్తారు. ప్రతివారికి అంటే తమోగుణంలో ఉన్నవారికైనా, రజోగుణంలో ఉన్నవారికైనా, సాత్విక గుణంలో ఉన్నవారికైనా 24 గంటల సమయమే ఉంటుంది. కానీ మానవుడు తన మనస్తత్వాన్ని బట్టి కాలాన్ని ఉపయోగించుకుంటాడు.

చాలామంది మహాత్ములు "కాలమే భగవంతుడు" అంటారు. చూడండి ఈ సృష్టిలో అన్నీ డబ్బుతో కొనుక్కోవచ్చు. కానీ కాలాన్ని డబ్బుతో కొనలేము. అందుకే ఎవరికీ దొరకనిది, దక్కనిది, చిక్కనిది కాలము ఒక్కటే అది భగవంతుడితో సమానము అని చెప్తూ ఉంటారు.

మరి మీరు పుట్టిన వెంటనే సాత్విక గుణంలోకి రారు. మానవ జన్మ వచ్చాక కొన్ని జన్మలు తమోగుణంలో, కొన్ని జన్మలు రజోగుణంలో, కొన్ని

జన్మలు సాత్వికంలో అలా గుణాలను మార్చుకుంటూ, మార్చుకుంటూ ఎదుగుతారు. మరి అలా ఎదిగే మానవుడు కాలాన్ని ఎలా ఉపయోగించు కుంటాడో మనం తెలుసుకుందాం.

ఎందుకు అంటే ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకునేవాడు సాత్వికుడు, వ్యర్థం చేసేవాడు రజోగుణంలో ఉన్నవాడు, కాలాన్ని దుర్వినియోగం చేసేవాడు అంటే తమోగుణంలో ఉన్నవాడు.

ఇక్కడ మీరు గమనిస్తే సాత్వికులు ఎవ్వరూ కూడా కాలాన్ని దుర్వినియోగం చేయరు. ఎందుకు అంటే వాళ్ళకి కాలం విలువ తెలుసు, ఎన్నో సందర్భాల్లో కాలం యొక్క గొప్పతనంతెలుసుకున్నారు.

మరి కాలాన్ని సద్వినియోగం చేసుకునేవారు సాత్వికులు అని ఎందుకు అన్నాము అంటే సత్వగుణం కలవారే సత్యం కోసం పాటుపడుతూ ఉంటారు. అంటే సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలని, అలాగే సత్యం అందరికీ బోధించాలని అనుకుంటారు. తమోగుణం, రజోగుణంలో ఉన్నవారికి సత్యం మీద ఆసక్తి తక్కువ ఉంటుంది. ఎప్పుడైతే సత్యం మీద ఆసక్తి పెరుగుతూ ఉంటుందో కాలాన్ని చాలా బాగా ఉపయోగించు కుంటారు.

ఎందుకంటే **"మృత్యువు మీ ప్రక్కనే ఉంటుంది, అది మిమల్ని వరించేలోగా మీరు తరించాలి" అని ఒక సాధకుడికి తెలుసు. ఏ క్షణంలో మృత్యువు వస్తుందో ఎవ్వరికీ తెలియదు. అందుకే పత్రిగారు ఎన్నో సందర్భాల్లో రేపటి పని ఈరోజు చెయ్యి, ఈరోజు పని ఇప్పుడే చెయ్యి"** అనేవారు.

గురువులు భూమిమీదకి వచ్చి నువ్వు కూడా మృత్యువుకి బలి కావలసిందే, నువ్వు భూమిమీద శాశ్వతంగా ఉండవు. మృత్యువుకి బలి అయ్యేలోగా నువ్వు ఈ భూమిమీద ఎన్ని నేర్చుకోవాలో అన్నీ నేర్చుకోవాలి. ఎంత జ్ఞానం పొందాలో అంతా పొందాలి. కాబట్టి ఒక్క క్షణం కూడా ఏమరుపాటుగా ఉండకు.. క్షణ కాలాన్ని కూడా వ్యర్థం చేయకు.. అని మనకి పదే పదే హెచ్చరిస్తూ ఉంటారు.

ప్రతిదీ కూడా రేపు చేద్దాం అనుకుంటారు. కానీ రేపు అన్నది మీ జీవితంలో ఉంటుందని గ్యారెంటీ లేదు. అంటే రేపు మీరు ఉంటారా? ఉండరా? అన్నది గ్యారెంటీ లేదు. అందుకే గురువుగారు చెప్తూ ఉండేవారు "రేపటి పని ఈరోజు చెయ్యి, ఈరోజు పని ఇప్పుడే చెయ్యి" అని. మరి ఒక సాత్త్వికుడు సాధన చేస్తూ, జ్ఞానాన్ని పెంచుకుంటూ, ఆ జ్ఞానాన్ని పది మందికి కూడా చెప్తూ తన సమయాన్ని సద్వినియోగం చేసుకుంటాడు.

చాలామందిని  చూస్తే పెద్ద వయసు వచ్చేటప్పటికి ఇంట్లో పని ఉండదు, వ్యాపారాలు ఉండవు, ఉద్యోగాలు ఉండవు, మాకేం తోచట్లేదు, బోర్ కొడుతుంది, మమ్మల్ని ఎవరూ పట్టించుకోవట్లేదు అంటారు. కానీ సాధన చేసుకునేవాడికి ఒకడు పట్టించుకోవాల్సిన అవసరమే లేదు.

ఎందుకంటే నిరంతరం సాధన, నిరంతరము స్వాధ్యాయము, ఈ రెండు ఉన్నవాళ్ళకి సమయం ఎప్పుడూ కూడా దుర్వినియోగం, నిర్వినియోగం అవ్వదు, సద్వినియోగమే అవుతుంది. మీరు ప్రపంచం కోసం ఎంత సమయం వెచ్చిస్తారో అదంతా సద్వినియోగం చేసుకున్నట్టే.

మీరు అనుకోవచ్చు, నేను ప్రపంచానికి ఇంత సేవ చేస్తున్నాను అని. కాని మీరు ప్రపంచానికి సేవ చేయట్లేదు. మీకు మీరే సేవ చేసుకుంటున్నారు. ఎందుకంటే సృష్టి అంతా ఉన్నది ఆత్మే. మరి ఏ ఆత్మకి నువ్వు సేవ చేసినా, నీకు నువ్వు చేసుకున్నట్టే. ఇది మహాత్ములకు తెలుసు కాబట్టే ఎవ్వరూ నాకు భగవంతుడు చెయ్యడానికి అవకాశం ఇచ్చాడు అని అనుకుంటూ చేస్తాడే కానీ నేనేదో చేసేస్తున్నానని గొప్పగా ఫీల్ అయిపోయి అహంకారాన్ని  పెంచుకోడు.

నేను చేస్తున్నాను, నేను కాబట్టి చేస్తున్నాను అని ఎప్పుడైతే భావిస్తారో, ఈ మేనుకు పెద్దరికం ఇస్తారో మళ్లీ మాయలో పడి అహంకారం తెచ్చుకుంటారు. అలా కాకుండా నిజంగా మీరు సత్వగుణంలో ఉంటే మీకు భగవంతుడు అవకాశం ఇస్తున్నాడు అనే భావంతో ఉంటారు.

ఇక్కడ మనకి రెండు పరీక్షలు ఉంటాయి. ప్రతి సాధకుడికి ప్రతి

నిమిషమూ పరీక్షే, ఎందుకంటే ఆ పరమాత్మ మాయలో పెట్టి అహంకారం పెంచుతూ ఉంటాడు. మరి ఎరుకలో ఉన్నామా? లేదా? అని పరమాత్మ మనల్ని పరీక్షిస్తూ ఉంటాడు. చేయడానికి అవకాశాలు వస్తున్నాయే కానీ నువ్వు అక్కడ చేయట్లేదు. భగవంతుడు ఆ ప్రకృతి ద్వారా నువ్వు కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, నువ్వు నేర్చుకున్న బ్రహ్మ విద్య పది మందికి నేర్పడానికి నీకు అవకాశం కల్పిస్తున్నాడు.

ఆ ప్రకృతే నీకు అవకాశం ఇవ్వకపోతే చెప్పే అవకాశం నీకెక్కడిది? వీసమెత్తు అహంకారం నీకు పెరిగినా నువ్వు పడిపోవడానికి అవకాశం ఉంది. అందుకే సాధకుడు అనుక్షణము చివరివరకు పోరాడాలి అంటారు, చివరివరకు పోరాడటం అంటే ఎక్కడా కూడా అహంకారం రాకుండా, ఏ నిమిషమైనా నేను అహంకారాన్ని పెంచుకుంటున్నానా లేదా? అని నీకు నువ్వు పరిశీలించుకోవాలి.

ఒకవేళ అహంకారం వచ్చిందని నీకు అనిపిస్తే వెంటనే నా మనసుకి ఏదో క్షణంలో నేను ప్రాధాన్యత ఇచ్చాను కాబట్టే నాకు మళ్లీ అహంకారం వచ్చింది అని తెలుసుకోవాలి. మరి ఇది పోవాలి అంటే నేను మళ్లీ ఆత్మకి దగ్గర అవ్వాలి. కాబట్టి నేను సాధన చేయాలి అని నీకు నువ్వే తెలుసుకుని సాధన పెంచుకుంటూ ఉండాలి.

ఈ మనసు ఆత్మకి దగ్గర అయినప్పుడు వినయం ఉంటుంది, సేవా భావం ఉంటుంది, త్యాగభావం ఉంటుంది. ఆత్మకి దూరమైనప్పుడు స్వార్థము, అహంకారము ఇలాంటి గుణాలన్నీ ఉంటాయి.

అందుకే మనసు ప్రపంచం వైపు వెళ్ళినప్పుడు మురికి లక్షణాలు వస్తూ ఉంటాయి, అంటే పది మందినీ విమర్శించే లక్షణాలు వస్తాయి, ఈ మనసు ఆత్మకి దగ్గర అయినప్పుడు అందరూ మెచ్చుకునే దైవ లక్షణాలు అలవాటు అవుతాయి.

అందుకే మీరు రెండు విషయాలు గమనించుకోవాలి. ఏమిటంటే?

కాలం దైవం అన్నారు మహాత్ములు. మరి నాకు అవకాశం వచ్చినప్పుడు ఈ కాలాన్ని నేను సద్వినియోగం చేసుకుంటున్నానా? లేదా? అన్నది ఆలోచించు కోవాలి.

సద్వినియోగం చేసుకోవడం అంటే ధ్యాన సాధన చేయడం, స్వాధ్యాయం చేయడం, నలుగురికి బ్రహ్మవిద్య చెప్పగలగడం, ఈ మూడు చేసినప్పుడు మీరు కాలాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలుసుకోవాలి. సత్యం కోసం అన్వేషణకు భూమిమీదకు వచ్చిన నేను గురువు ద్వారా నేర్చుకున్న ఈ సత్యం అందరికీ చెప్పగలుగుతున్నాను అంటే నేను గురువుకి, భగవంతుడికి విధేయుడునై ఉన్నాను అని తెలుసుకోవాలి.

ఈ మూడు మానేసి మీరు వృధాగా కాలక్షేపం చేస్తే నిర్వినియోగం చేసిన వాళ్ళే అవుతారు. మరి భగవంతుడు దుర్వినియోగం చేసినా, నిర్వినియోగం చేసినా ఎప్పటికీ క్షమించడు. ప్రకృతిలో ఒక ధర్మం ఉంది, ఇచ్చినవి వృధా చేస్తే వెనక్కి తీసుకోబడతాయి అవి.

ఈ భూమిమీద జీవుడిగా పుట్టిన నీకు దేవుడిగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు భగవంతుడు ఇచ్చి భూమిమీదకు పంపాడు. మరి ఆ అవకాశాలని నువ్వు ఉపయోగించుకోకుండా దుర్వినియోగం చేస్తే అవకాశాలన్నీ వెనక్కి తీసుకోబడతాయి.

ఒక్కసారి గమనిద్దాం. పత్రీగారు అందరి జీవితాల్లోకి వచ్చారు. కొన్ని లక్షల మందికి ఆయన “శ్వాస మీద ధ్యాస” అనే ధ్యానాన్ని నేర్పించారు. నువ్వు దేవుడిగా ఎదగడానికి “శ్వాస మీద ధ్యాస” ద్వారా నువ్వు ఎదగొచ్చు అన్నారు.

సూక్ష్మం అంతా ఆ చిన్న దాంట్లో ఉంది. చిన్న మఱ్ఱి విత్తనంలో మఱ్ఱి చెట్టు దాగినట్టు. “శ్వాస మీద ధ్యాస” అనే చిన్న మహా మంత్రంలో అద్భుతమైన బ్రహ్మజ్ఞానం దాగి ఉంది అని చెప్పినప్పుడు మనలాంటి ఏ కొద్దిమందికో అర్థమవుతుంది. ఎందుకంటే గురువుకి, శిష్యులు ఎందరో

ఉండొచ్చు. కానీ గురువునే త్రికరణ శుద్ధిగా నమ్మి, గురువు సత్యం చెప్తున్నాడు కాబట్టి ఆ మాటలే వేదవాక్కుగా భావించే వారు ఏ కొద్ది మందో ఉంటారు. మీరు ఆయన్ని నమ్మారు కాబట్టే ఆయన చెప్పిన “శ్వాస మీద ధ్యాస” ధ్యానం చేస్తూ ఈరోజున ఈ సొసైటీలో ఉన్న ఎంతో మంది కంటే కొంచెం ముందుగానే జ్ఞానాన్ని పెంచుకుంటున్నారు.

మరి ఆ చిన్న మహా మంత్రాన్ని మీరు ఆచరించారు కాబట్టే ఈవేళ ఎదుగుతున్నారు. ఇంకా ఏం చెప్పారంటే నువ్వు ఎదగాలి అంటే కళ్ళు మూసుకుని కూర్చోవడం ఒకటే కాదు, స్వాధ్యాయం కూడా చేయాలి అని అన్నారు.

ఎందుకంటే ఈ భౌతిక ప్రపంచంలో ఉన్న మీకు కొన్ని అవసరాలు కూడా ఉంటాయి. మరి ఆ అవసరాలు తీర్చుకోవాలంటే కళ్ళు విప్పి ప్రపంచంలో మీ పనుల చేసుకోవాలి. అలా చేసుకుంటున్నప్పుడు మీ మనసు చంచలత్వంలోకి వెళ్తూ ఉంటుంది. ఆ చంచలత్వంలోకి వెళ్తున్న మనసులో మళ్ళీ ఏకాగ్రత తీసుకురావడానికి, ఏకాంతంగా కూర్చోవడానికి మీకున్న అవకాశం స్వాధ్యాయమే.

చూడండి మీరు పది మందితో కలిపి ధ్యానం చేయగలరు. కానీ స్వాధ్యాయం మాత్రం మీకు మీరు కూర్చుని చదువుకోవచ్చు. అలా మీకు ఎన్నో విధాలుగా ప్రతి క్షణాన్ని ఎలా ఉపయోగించు కోవాలో పత్రిగారు నేర్పించారు.

అందుకే సాత్విక గుణంలో వున్నవారికి కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం బాగా తెలుసు. మీరు ఎప్పుడైనా, ఎవరికైనా చెప్పాల్సి వచ్చినప్పుడు మీరు ఏదైతే ఆచరిస్తున్నారో అదే చెప్పాలి. కానీ ఆచరణ ఒకటి, చెప్పేది ఇంకొకటి ఎప్పుడూ వుండకూడదు.

సాధనలో మీ దృష్టి ఆత్మ వైపు వుండాలి. ఆత్మ వైపు దృష్టి ఉండడం వల్ల ఒక చిన్న అబద్ధం ఆడాలన్నా మీ అంగీకరించదు. ఎందుకు అంటే ఎన్ని

సార్లు మీరు మోసం చేసి అబద్ధం ఆడతారో ఆత్మకి అంత దూరమవుతారు. ఆత్మ వైపు తిరిగి ఉన్నారు కానీ వెనక్కి అడుగులు వేస్తున్నారు.

అందుకే త్రికరణ శుద్ధి ఉండాలి అన్నారు. రజోగుణంలో ఉన్నవాళ్ళు ఎంతసేపు ప్రజలు నన్ను పొగుడుతున్నారా? లేదా? నేను చేసిన మంచి పని గుర్తిస్తున్నారా? లేదా? అనే ఆలోచనే కానీ పరమాత్మ మెచ్చుతున్నాడా? లేదా? అనేది వుండదు. మీ జీవితంలో పురోగతి సాధిస్తే పరమాత్మ మిమ్మల్ని మెచ్చుకున్నట్టే లెక్క. ఆయన వచ్చి నీ భక్తికి మెచ్చాను అని మీకేమీ చెప్పదు. మీరు పురోగతి సాధించారా? లేదా? అన్నది తెలుసుకోవాలంటే నాకు జ్ఞానం పెరుగుతుందా? లేదా? నా సాధనలో అవరోధాలు కలగకుండా ఉన్నాయా? లేదా? అని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి.

మీరు కొన్న పుస్తకాలు బీరువాలో పెట్టడమే కాదు, వాటిలో నుంచి మీకు నచ్చిన పుస్తకం చదవండి, మంచి పాయింట్ దొరుకుతుంది.

అంటే ఎప్పుడో చదివినప్పుడు ఆ పాయింట్ మీకు అవసరం లేదు. అందుకే అది ప్రక్కకు వెళ్ళిపోయింది. కానీ ఇప్పుడు నీకు ఆ పాయింట్ అవసరం కాబట్టి మీ దృష్టి ఆ పాయింట్ మీదకి వెళ్ళింది. అందుకే ఈ స్పిరిచువల్ బుక్స్ అన్నీ కూడా ఒకసారి చదివి ప్రక్కన పెట్టేవి కాదు అని తెలుసుకోండి.

అలా కాలాన్ని సద్వినియోగం చేసుకునేవాడు సాత్వికుడు. ఆ సాత్విక గుణం ఉన్నవాడే సత్యానికి దగ్గర అవ్వగలడు. మరి రజోగుణంతో ఉన్నవాడు కాలాన్ని వ్యర్థం చేస్తాడు అంటే నిర్వినియోగం చేస్తాడు. నిర్వినియోగము అంటే ఆత్మకి సంబంధించింది కాకుండా మిగతా ఏ పనులు చేసినా కాలాన్ని నిర్వినియోగం చేసినట్టే.

మీరు శరీరం, కుటుంబం యొక్క పోషణ అవసరం కాబట్టి, వాటిని చేసుకోవడం తప్పుకాదు. కానీ కాలక్షేపం పనులు, ఆత్మోన్నతికి అడ్డమవుతాయి.

ఎప్పుడైతే నువ్వు వ్యవహారాల్లో మునిగి ఉంటావో అప్పుడు నువ్వు కాలాన్ని పాడు చేసుకుంటున్న వాడవే అవుతావు. ఈ రజోగుణ ప్రధానులు

ఆత్మ గురించి తెలిసినా కూడా వేరే పనులు చేస్తూ నిర్వినియోగం చేసుకుంటారు.

మరి కొంతమంది ఎంతసేపూ భార్య, పిల్లలు ఎంటర్‌టైన్‌మెంట్ చూసుకుంటారు. ఇది కూడా నిర్వినియోగం చేసుకున్నట్టే. వీళ్ళు అప్పుడే సాధనలోకి రారు కొన్ని  జన్మలు పడతాయి. సాధన ఎందుకు అవసరం అంటే? సాధన చేసేవాడి ఆలోచనలు చాలా బలంగా ఉంటాయి. ఒక మాట అనుకున్నాడంటే అది ఖచ్చితంగా చేసి తీరతాడు. వాడికి అంత సంకల్ప శక్తి ఉంటుంది.

చూడండి ఇప్పుడు మీ గదిలో లైట్ ఉంది ఆ లైట్ కి దగ్గరగా కూర్చుంటే వెలుతురు ఉంటుంది. అలా కాకుండా గదిలో లైట్ వేసి దూరంగా హాల్లో కూర్చుంటే వెలుతురు సరిగా వుండదు. అలాగే మీ మనసుని ఆత్మ వైపు తిప్పినప్పుడు ఆలోచనలు అతి శక్తివంతంగా తయారవుతాయి. అదే మనసు ఆత్మకు దూరమైతే ఆ ఆలోచనలు నిర్వీర్యంగా ఉంటాయి.

ఎందుకంటే? భగవంతుడి యొక్క తేజస్సులో ఉన్న ఆలోచనలు గొప్పగా వుంటాయి. అంటే గొప్పగా ఎదగాలి, సాధన బాగా చెయ్యాలి, జ్ఞానం పెరగాలి, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నట్లుగా వుంటాయి. అప్పుడు ఎంతో పురోగతిని సాధిస్తారు.

సాధన, సేవ ఈ రెండు మీకు ఉన్నప్పుడు ప్రతి క్షణం సద్వినియోగం చేసుకుంటారు. అందుకే కాలాన్ని సద్వినియోగం చేసినవాడు సాత్వికుడు, నిర్వినియోగం చేసిన వాడు రాజసికుడు, దుర్వినియోగం చేసినవాడు తామశికుడు అంటారు. అలా మానవులు చేసే పనులని బట్టి మూడుగా విభజించడం జరిగింది.

ఎవరైతే వర్తమానాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడే మహాజ్ఞాని కాగలడు. అందుకే 'వర్తమానమే బహుమానం' అని ఊరికే అనలేదు. అది అర్థం చేసుకుంటే కాలాన్ని ఎప్పుడూ సద్వినియోగం చేసుకుంటారు.

# యజ్ఞమయ జీవితం పొందాలి అంటే ఏ విధంగా ఉండాలి?

జ్ఞానపరంగా ఎదగడానికి ఎన్నో సందేశాలు విన్నా, చదివినా ఎంత వరకు ఆచరణలో పెడుతున్నారు అన్నదే ముఖ్యం. అందుచేత మీరు విన్నారా? లేదా? అని కాదు, విన్నది ఆచరిస్తున్నారా? లేదా? అన్నదే ముఖ్యం. ఆచరణ ఉంటే కానీ ఎవ్వరిలోనూ మార్పు ఉండదు, ఫలితం రాదు.

చాలా మంది ధ్యానం చేస్తున్నారు కానీ మోక్షం ఏ విధంగా పొందగలరో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్నారు. కారణం మనసు శుద్ధంగా వుంచుకోకపోవడమే. మహాత్ములు అందరూ ఒకటే చెప్తారు, ఈ భూమి మీదకు వచ్చిన మానవులంతా కూడా 'యజ్ఞమయ జీవితం' జీవించగలిగితే భూమిమీద ఉండగానే మోక్ష స్థితి పొందుతారు అని.

ఈశావాస్యోపనిషత్తులో **"మనకున్న సంపదలన్నీ భగవంతుడివే కాబట్టి త్యాగబుద్ధితో అనుభవిస్తే అంటే పది మందికి పంచి తాను అనుభవిస్తే అది యజ్ఞమయ జీవితం అవుతుంది అన్నారు".**

అందుకే ఎవరైనా సరే **"మోక్షం పొందాలి అంటే మనసుని నిర్మల ఆకాశంలా ఉంచుకోగలగాలి".** ఒక్కొక్కసారి మీరు ఆకాశాన్ని గమనించినప్పుడు ఏ మేఘాలు లేకుండా నిర్మలంగా కనిపిస్తూ ఉంటుంది. మీ మనసు కూడా అలా ఉంచుకోవాలి, అలా ఉంచుకున్న రోజు మీరు ఆనంద స్థితిలో ఉండగలుగుతారు.

అందుకే కోరికల కోసం కాకుండా భగవంతుడ్ని పొందాలి అనే తపన వుండాలి. దానికి అవసరమైన ధ్యాన సాధన చెయ్యాలి.

ఒకవేళ ఏ కోరికతోనో ధ్యానంలోకి వచ్చినా, రాను రాను ఆ కోరికను కూడా వదులుకుని, ధ్యానం భగవంతుడి కోసమే అని చెయ్యాలి. ఎప్పుడైతే మీలో సేవా భావం, త్యాగం ఉంటాయో అప్పుడు ఆ పరమాత్మ కృప వల్ల మీ జీవితంలోకి గురువు వస్తాడు.

గురువు వచ్చే వరకు మీకు స్వార్థం పోదు. ఎందుకంటే మీరు

పుట్టినప్పటి నుంచి నా భార్య, నా పిల్లలు, నా భర్త, నా సంసారం, నా ఊరు, నా కులం, నా మతం అనే స్వార్థపూరితమైన జీవితం జీవించి, ఎన్నో జన్మలు తీసుకొని, ఆ సంస్కారాలన్నీ ఒక జన్మ నుంచి మరో జన్మకు మోసుకుంటూ వచ్చారు. వచ్చి ఇక్కడ ఎన్ని ఐశ్వర్యాలు ఉన్నా, ఎన్ని సంపదలు, ఎన్ని భోగాలు ఉన్నా, జీవితంలో కష్టాలు, బాధలు, రోగాలతో దుఃఖపడుతున్నారు. ఆనందం అన్నది తాత్కాలికమైపోయింది, శాశ్వత ఆనంద స్థితిలో వుండవలసిన వారు, శాశ్వత దుఃఖ స్థితిలో ఉంటున్నారు. దీనికి కారణం గత జన్మల నుంచి మోసుకొచ్చిన సంస్కారాల ఫలితమే.

నువ్వు మనసుని శుద్ధి చేసుకుంటే మహాత్ముడవు కాగలవని గురువు చెప్తారు. అలా మనసుని శుద్ధి చేసుకోవాలి అంటే మొట్టమొదట నువ్వు 'యజ్ఞమయ జీవితం జీవించాలి'.

'యజ్ఞమయ జీవితం' అంటే లోక కళ్యాణం కోసం నిష్కామంగా కర్మలు చేస్తే అది యజ్ఞమయ జీవితం అవుతుంది అని చెప్తారు. గీతలో కూడా యజ్ఞ కర్మలే నిన్ను సత్యం వైపుకు నడిపిస్తాయి అని చెప్పబడింది.

అందుకే గురువు వచ్చాక జ్ఞానిగా ఎదగాలని, ఆనంద స్థితికి చేరుకోవాలని చెప్తారు. అంటే నువ్వు సృష్టికి ఇవ్వడం మొదలు పెడితే సృష్టి నుంచి నువ్వు చాలా పొందుతావు అని గురువు చెప్తారు.

అయితే భూమిమీదకు మానవ జన్మ తీసుకుని దేనికి వస్తున్నారంటే? తానెవరో తెలుసుకోవడానికి. అది తెలుసుకోనంతసేపు దుఃఖమే. సాధన వల్ల మాత్రమే నీకు జీవితంలో ఆనందం అనేది దక్కుతుంది, సాధన లేకపోతే బ్రతుకంతా వేదనే. మరి 'యజ్ఞమయ జీవితం' పొందాలి అంటే మొట్టమొదటి మానవుడికి యజ్ఞము, దానము, తపస్సు, యోగము, శ్రద్ధ, భక్తి అనే లక్షణాలు ఉండాలి.

**1) యజ్ఞం:**

మానవుడు నిరంతరము కర్మజీవి, కర్మ లేకుండా ఒక్క నిమిషం

కూడా ఉండలేడు, అందుచేత కర్మ చేయాల్సిందే. కానీ ఆ కర్మలు ఎప్పుడైతే నిష్కామంగా అంటే కోరిక లేకుండా పది మంది కోసం చేస్తూ ఉంటాడో అవి యజ్ఞ కర్మలు అవుతాయి అని గీతలో చెప్పడం జరిగింది.

అంటే లోక కళ్యాణం కోసం మీరు చేసే కర్మలే యజ్ఞమయ జీవితాన్ని ప్రసాదిస్తాయి. కర్మ చేస్తున్నప్పుడు నేను చేస్తున్నాను అని కాకుండా ఇది నా ధర్మం, ఇది నా విధి, ఇది చేయడానికి నాకు భగవంతుడు అవకాశం ఇచ్చాడు అని చెయ్యాలి. మానవ జన్మ తీసుకున్న ప్రతి ఒక్కరి విధి ఏమిటంటే? సాధన చేసి తానెవరో తెలుసుకోవడం.

సాధనలోకి రాకముందు మీరు జీవించిన జీవితాన్ని, సాధనలోకి వచ్చాక ఇప్పుడున్న జీవితాన్ని గమనించుకుంటే చాలా తేడా ఉంటుంది. ఇంకా ఆత్మ దర్శనం పొందక పోయినా కూడా 10 మంది కోసం ఏ మంచి పని చేస్తున్నా మీకు లోపల నుంచి ఆనందం వస్తుంది.

అందుకే నిష్కామ కర్మ చెయ్యాలి అంటారు, ఈ నిష్కామ కర్మ చేసే అవకాశం ప్రతి ఒక్కరికీ ఉంది, అందుచేత ఇది నా బాధ్యత అనుకుంటూ చేయాలి. పత్రిగారి గురువుగారైన సదానందయోగి ఈ ప్రపంచంలో మాంసాహారాన్ని మానిపించే బాధ్యత నీదే సుభాష్ అనగానే తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి ఆ కార్యాన్ని తన మీద వేసుకున్నారు.

ధ్యానం ఎందుకు అంటే? మనసు చంచలత్వంలో లేకుండా ఉండటానికి. అలా ఉండడం వల్ల ఒక నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటారు. ఇప్పుడు ప్రాపంచిక జీవితంలో ఎన్నో నిర్ణయాలు తీసుకుంటారు. కాని కొన్ని అవుతాయి, కొన్ని అవ్వవు. కాని సాధనా మార్గంలోకి వచ్చాక ఆ నిర్ణయాన్ని పూర్తి చేయడానికే ప్రయత్నిస్తారు.

అంటే మనసు చంచలావస్థ నుంచి నిశ్చలావస్థకు వచ్చినట్టే. కాబట్టి ఒక నిర్ణయం తీసుకుంటే చేయగలిగే సత్తా కూడా సాధన వల్లే వస్తుంది. మరి ఇలా చేస్తూ నేను చేస్తున్నాను అనే అహం పెంచుకోకుండా ఇది నా విధి, నా కర్తవ్యం, నా ధర్మం అనుకుంటూ చేసినప్పుడు ఎప్పుడూ కూడా

ఆనందకరమైన జీవితం జీవిస్తారు, అదే 'యజ్ఞమయ జీవితం'.

పూర్వం ఋషులు ఎప్పుడూ కూడా యజ్ఞాలు చేసేవారు కానీ అవి వాళ్ళ కోసం కాకుండా లోక కళ్యాణం కోసం చేసేవారు. ఇలా చేయడం వల్ల వారు ఏది చేసినా వారికి దైవశక్తి తోడయ్యేది. అందుకే యజ్ఞమయ జీవితం జీవించే వాళ్ళకి ఎప్పుడూ దైవశక్తి అపారంగా ఉంటుంది. అందుకే **"పరహితం కోరే మనసుకి ప్రపంచమంతా దాసోహం అవుతుంది"** అంటారు. అంటే పరుల హితం కోరే వారికి ఈ ప్రపంచమంతా దాసోహం అయ్యేటటువంటి శక్తి వారి కోరికకు ఉంటుంది, వారికి భగవంతుడి కృప ఉంటుంది.

మరి నిష్కామ కర్మ ద్వారానే యజ్ఞమయ జీవితం ప్రాప్తిస్తుంది. సహజంగా యజ్ఞం, యాగం అనగానే హోమాలు, హవిస్సులు అనుకుంటారు కాని వాటికంటే 'ధ్యాన యజ్ఞాలు' చాలా గొప్పవి.

**2) దానం:-**

అంటే మీకు ఉన్నదాంట్లో కొంత అందరికి ఇవ్వాలి. ఎందుకంటే ఈశావాశ్యోపనిషత్తు చదివితే మీకు అర్థమవుతుంది. ఈ సంపదలు, ఈ సృష్టి అంతా భగవంతుడిదే. పూర్వజన్మ పుణ్యం వల్ల మీకు ఇవి అనుభవించడానికి మాత్రమే ఇవ్వబడ్డాయి. అందుకే షిరిడీ బాబా త్యాగబుద్ధితో అనుభవించు అన్నారు.

**3) తపస్సు:-**

అంటే ప్రాపంచిక అవసరాలు తగ్గించుకుంటూ ఉండడం. అంటే ఆహారం, నిద్ర, మాటలు అన్నీ తగ్గించుకుంటూ జ్ఞానం పొందటానికి ధ్యానం, స్వాధ్యాయం శ్రద్ధగా చెయ్యాలి. అలా జీవించడమే తపస్సు.

**4) యోగం:-**

"యోగః చిత్తవృద్ధి నిరోధః" అన్నారు పతంజలి మహర్షి. అంటే చిత్త వృత్తులు లేకుండా చేసుకోవడం. ఆ స్థితి పత్రీజీ బోధించిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తే తేలికగా వస్తుంది. దానికి నిష్కామ కర్మ, దానము, తపస్సు

ఇవి మూడు  అలవాటు చేసుకోవాలి. నిష్కామ కర్మ అంటే ప్రతిఫలం ఆశించ కుండా చేయడం.

అందుకే యోగ మార్గంలోకి వచ్చిన వారు నిష్కామ కర్మ చేయడం, సేవా భావం, త్యాగమయ జీవితం, తపస్సు, నిత్య అనిత్య వస్తు వివేకం లాంటివి అలవరచుకోవాలి. సాధకుడు నిత్యమైనది ఏమిటి? అనిత్యమైనది ఏమిటి? అన్నది తెలుసుకుని జీవించడం చాలా ముఖ్యం. ఇవన్నీ ఆచరణలో ఉంటే ధ్యానం చాలా బాగా కుదురుతుంది.

ఈ యోగ జీవితంలో **"పరహితం కోరేవాడే పరమాత్మ స్థాయికి ఎదుగుతాడు"** అని మహాత్ములు చెప్తారు.

**5) శ్రద్ధ:-**

శ్రద్ధ అన్నిటి మీద ఉండాలి. కర్మ చేయడం మీద, దానం చేయడం మీద, తపస్సు మీద శ్రద్ధ ఉన్నప్పుడు సాధన  చక్కగా కుదురుతుంది.

అందుకే **"శ్రద్ధతో చేసిన ధ్యానం జ్ఞానాన్ని పెంచుతుంది, అశ్రద్ధతో చేసిన ధ్యానం భోగం మీదకి వెళ్తుంది"** అని అంటారు. అందుకే గీతలో కృష్ణ భగవానుడు "శ్రద్ధవాన్ లభతే జ్ఞానం" అన్నాడు. నువ్వు సాధన చేస్తున్నావు కానీ చేసే సాధన శ్రద్ధతో చేస్తే అది నిన్ను జ్ఞానవంతుడిగా మారుస్తుంది. అందుకే సాధన మీద శ్రద్ధ ఉండాలి అంటారు, సాధన అంటే భగవంతుడి మీద దృష్టి నిలపడం.

మరి అలా ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త నీలోనే ఆత్మగా ఉన్నాడు అని తెలుసుకున్నాక, నువ్వు సాధన చేస్తున్నప్పుడు నేను ఆత్మ మీద దృష్టి పెట్టాను అని తెలుసుకుని నువ్వుగా శ్రద్ధ పెట్టి చెయ్యాలి. అది ఒకరు చెప్తే వచ్చేది కాదు, భగవంతుడి మీద శ్రద్ధ అనేది నీకు నీకే రావాలి.

**6) భక్తి:-**

భగవంతుడి మీద తీవ్రాతి తీవ్రమైన ఇష్టం ఉన్నవాళ్ళకే భక్తి ఉంటుంది, భగవంతుడంటే అర్థం కాని వాడికి భక్తి ఉండదు.

మరి అంత తీవ్రాతి తీవ్రమైన భక్తి మీకు ఉంటేనే  శ్రద్ధ మీకు

వస్తుంది. ఆ శ్రద్ధ, భక్తి వల్ల సాధన చక్కగా కుదురుతుంది. మరి నిష్కామ కర్మ చేస్తూ, ఎప్పుడూ ఎదుటివాడి కోసమే పాటుపడితే వాడు యజ్ఞమయ జీవితం జీవిస్తున్నట్టు.

పూర్వం ఋషులందరూ కూడా యజ్ఞమయ జీవితమే జీవించేవారు. వారు వాళ్ళ కోసం ఏమీ కోరుకోలేదు. వారు యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, ఏది చేసినా లోక కళ్యాణం కోసమే చేశారు. అందుకే ప్రతి నిమిషం నిష్కామంగా అందరి కోసం పాటుపడమని మహాత్ములందరూ బోధించారు.

అంతే కాదు సాధనతో పాటు జ్ఞానం పెంచుకోవాలి, అది 10 మందికి పంచాలి, అలా అందరి కోసం జీవించగలిగితే అది యజ్ఞమయ జీవితం.

గురువు అందరికీ ఒకే పాఠం చెప్తాడు. కానీ శిష్యుని యొక్క స్థితులను బట్టి ఆ గురువు మాటలు అర్థమవుతాయి. మీ జీవితంలోకి గురువు వచ్చినా మీరు ఉత్తమ శిష్యుల్లా ఉన్నారా? మధ్యమ శిష్యుల్లా ఉన్నారా? అధమ శిష్యుల్లా ఉన్నారా? అన్నది తెలుసుకోవాలి. ప్రతీ రోజూ, ప్రతీ విషయం తెలిసినట్టే ఉంటుంది. ఎంతవరకు వినాలి అంటే? అది ఆచరణలో పెట్టుకునే వరకు వినాలి.

ఇక్కడ "ఉత్తమ శిష్యుడు" దూది లాంటివాడు. గురువు చెప్పిన వెంటనే గ్రహిస్తాడు. అంటే వీళ్ళు గత జన్మలో ఎంతో కొంత సాధన చేస్తారు. ఆ సాధన యొక్క ఫలితం ఈ జన్మలో కూడా ఉంటుంది కాబట్టి గురువు రాగానే ఈ ప్రపంచము, శరీరము, బంధాలు అనే మాయని తొలగించుకొని గురువు చెప్పిన విషయాల్ని వెంటనే అర్థం చేసుకుంటాడు.

వీళ్ళు దూది లాంటివారు. దూది చూడండి ఏ చిన్న నిప్పు రవ్వ తగిలిన భగ్గున మండిపోతుంది. అట్లాగే ఈ ఉత్తమ శిష్యుడు గురువు చెప్పిన వెంటనే అన్ని విషయాలు గ్రహించి ఆ గురువుకు శరణాగతి అయి గురువుని ఫాలో అవుతాడు. గురువు చెప్పిన వాక్యం తప్పించి ఇంకేది కూడా ఆ శిష్యుడికి నచ్చదు.

ఇక "మధ్యమ శిష్యుడు" ఎండుకట్టె లాంటివాడు. ఇప్పుడు ఎండు

కట్టెకి నిప్పు పెట్టాక కొంచెం ఊదాలి. ఊదితే అది బాగా మండుతుంది. అలాగే ఈ మధ్యమ శిష్యుడు గురువు చెప్పిన సాధన చేసి అప్పుడు అది సత్యమని నమ్మి ఫాలో అవుతాడు.

ఇక "కనిష్టుడు" తడికట్టె లాంటివాడు. ఈ తడికట్టలు ఎండపెడితే కానీ మండవు. అలాంటి తడికట్టె లాంటి శిష్యులు వెంటనే నమ్మరు. ఇప్పుడు పత్రిగారు చాలామందికి పూజలు వద్దు, విగ్రహారాధన వద్దు, మాంసం వద్దు అని చెప్పినప్పుడు చాలామందికి కోపం వస్తుంది.

పత్రిగారు వచ్చాక నిజంగా ధ్యానం గురించి ఒక యుద్ధమే జరిగేది. మాంసం వద్దని, పూజలు వద్దని చెప్పాలి అంటే చాలా ధైర్యం ఉండాల్సి వచ్చేది. ఎందుకంటే విగ్రహంలో నువ్వు చూసేది భగవంతుడి ప్రతిరూపం. మరి ఆత్మ అంటే అసలైన భగవంతుడని చెప్పాలి అంటే వాళ్ళని చాలాసేపు కూర్చోబెట్టి నచ్చ చెప్పాల్సి వచ్చేది. వీళ్ళంతా తడికట్టె లాంటి వాళ్ళు. వీళ్ళు ఏదో జన్మలో వస్తారు. కానీ వీళ్ళని మార్చడానికి చాలా కష్టపడాలి.

దూదిని కాల్చడానికి కష్టపడక్కర్లేదు. ఎండు కట్టెని కాల్చడానికి అంత కష్టపడక్కర్లేదు, తడి కట్టెల్ని మంట పెట్టడానికే కష్టపడాలి. ఎందుకంటే అవన్నీ ఎండపెట్టాలి. ఎండ పెట్టడం అంటే ఇంత సబ్జెక్ట్ వాళ్ళకి నేర్పించాలి. నేర్పించి కొన్ని నెలలకి సేవా మార్గంలోకి వాళ్ళని తిప్పాలి.

అలా వినగా వినగా మెల్లిగా ధ్యానంలోకి వస్తారు. దానికి ఒక జన్మ పట్టొచ్చు, 10 జన్మలు పట్టొచ్చు, 100 జన్మలు పట్టొచ్చు. ఈ తడికట్టెలన్నీ ఏదో ఒక రోజుకి ఎండుకట్టెలు అవుతున్నట్టు వీళ్ళు కూడా ఏదో ఒక జన్మలో ఈ ధ్యాన మార్గంలోకి వస్తారు.

కానీ విన్న వెంటనే ఈ జన్మలోనే ఈ యజ్ఞమయ జీవితం మొదలు పెట్టగలగాలి అంటే నిష్కామ కర్మ చేయాలి. మనం ఎవరికి ఏ సహాయం చేసినా భగవంతుడు నాకు చేయడానికి అవకాశం ఇస్తున్నాడు కానీ ఇక్కడ నేనేమీ చేయట్లేదు అని పరిపూర్ణమైన శరణాగతి భావం ఉండాలి.

# దక్షిణామూర్తి సనకసనందనాదులకు చేసిన బోధ

జ్ఞానం గురించి తెలుసుకోవాలి అనే ఆసక్తి కొందరికే ఉంటుంది. పూర్వం కృతయుగంలో ఈ జ్ఞానాన్ని పొందడానికి, పరమాత్మను దర్శించడానికి చాలా  కష్టపడి ప్రయత్నించేవారట.

ఈ  ప్రపంచం అశాశ్వతము, పరమాత్మ శాశ్వతుడు అని తెలుసుకుంటే ఈ సృష్టిలో  అన్నిటిలో ఉన్న అల్పమైన ఆనందాలన్నీ కలిపి ఒక్క చోటకి చేరిస్తే ఎంత ఆనందం పొందుతావో అలాంటి ఆనందం పరమాత్మను తెలుసుకున్నప్పుడు మాత్రమే పొందగలము అని కృతయుగంలో అందరికీ అర్థమయ్యేది.

అందుకే అందరూ ధ్యాన సాధన గురించి, జ్ఞానం గురించి  తమ దైనందిన కార్యక్రమంలో ఒక భాగంగా చేసుకునేవారు. అందరూ అదే ఆలోచనలతో, భావాలతో  ఉండేవారు కాబట్టే  ధ్యానము అనే పదం కొత్తదిగా అనిపించేది కాదు. ప్రస్తుతం ప్రాపంచిక జీవితంలో పనులు ఎలా చేస్తున్నారో, అప్పుడు ధ్యానము,జ్ఞానము కూడా వాళ్ళ జీవితాల్లో అలా ఉండేవి.

అందుకే వారు హాయిగా, ఆనందంగా ధర్మాన్ని ఆచరిస్తూ, సత్యం గురించి అన్వేషిస్తూ  జీవించేవారు. ఎప్పుడైతే ధర్మాన్ని, సత్యాన్ని పట్టుకున్నారో వారు పవిత్రత, ప్రేమ అనే రెండిటిలో జీవిస్తూ ఉండేవారు.

'పవిత్రత' అంటే సరైన విధంగా జీవించడం. ' ప్రేమ' అంటే ప్రతి వాళ్ళని ఇష్టపడడం. వారుఈ రెండిట్లోనే ఉండేవారు.

జ్ఞానాన్ని బోధించిన మొట్టమొదటి ఆది గురువు ఎవరు అంటే? దక్షిణామూర్తి అని చెప్తారు. దక్షిణామూర్తి విశ్వానికే ఆది గురువు. ఎందుకు దక్షిణామూర్తి పేరు బయటకి వచ్చింది అంటే సనకసనందనాదులు పుట్టిన వెంటనే వారు బాలకులుగా మారిపోయారట. మారిపోయి మేము ప్రపంచంలో జీవిస్తే కొన్ని కర్మలు వస్తాయి, కాబట్టి మేము మొట్టమొదట జ్ఞానం నేర్చుకుంటే

ఆ కర్మలను మేము అంటించుకోకుండా ఉండగలము అని, జ్ఞానం నేర్చుకోవాలని అనుకున్నారట.

అలా అనుకొని బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్తారట. వారు బ్రహ్మదేవుడి దగ్గరికి వెళ్ళేటప్పటికి, ఆయన సరస్వతీ దేవి వీణ వాయిస్తుంటే తన్మయత్వంలో వింటూ ఉంటాడట. వీళ్లు ఒక ఐదు నిమిషాలు నిలుచుని "ఈయన ఆవిడ తన్మయత్వంలో పరవశిస్తున్నాడు మనకేం జ్ఞానం నేర్పుతాడు" అని వెనక్కి తిరిగి వచ్చేసారట.

తర్వాత విష్ణుమూర్తి దగ్గరికి వెళ్ళారట, విష్ణుమూర్తి మరి లక్ష్మీదేవితో సరసాలాడుతూ కాళ్ళు ఒత్తించుకుంటూ ఉన్నాడట. అది కూడా సనక సనందాదులకి నచ్చలేదు, మాకు ఈయనేం జ్ఞానం నేర్పుతాడు అనుకుంటూ వెనుతిరిగారట.

ఈశ్వరుడి దగ్గరికి వెళ్తే పార్వతీ దేవితో నాట్యం చేస్తున్నాడట. "ఈయన భార్యతో కేళి విలాసంలో ఉన్నాడు మనకేం నేర్పుతాడని" వెను తిరిగి వెళ్ళిపోదామని బయలుదేరారట .

అంటే వీళ్ళ ముగ్గురికి తెలియక కాదు సనకసనందాదులు ఏ స్థితిలో ఉన్నారో అని పరీక్షించడానికే ఆ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అలా వాళ్ళకి కనిపించారు. అంటే ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఏమిటి అంటే వీళ్ళు వైభోగం కావాలనుకున్నారా ? సంసారానికి ఆకర్షితులు అవుతారా? ప్రాపంచిక సుఖాలకు ఆకర్షితులు అవుతారా? ఇవన్నీ వద్దు మాకు పరమాత్మ జ్ఞానం కావాలి అని ఆశపడతారా? అని పరీక్షించడానికే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఆ రకంగా సనక సనాందులకు కనిపించారట.

వాళ్ళు తిరిగి వస్తూ ఉంటే ఈశ్వరుడు వీళ్ళు వచ్చే దారిలో దక్షిణం వైపు ముఖం పెట్టుకొని కూర్చుంటాడట, అందుకే ఆయన్ని దక్షిణామూర్తి అని అంటారు.

సనకసనందనాదులు ఈయన కళ్ళు మూసుకుని ఉండడం చూసి వాళ్ళకి ఎందుకు అనిపించిందో నలుగురు కూడా ఆయనకి ఎదురుగా కూర్చుని

కళ్ళు మూసుకున్నారట.ఎందుకు అంటే ప్రతి దాని వెనకాల ప్రకృతి యొక్క ప్రమేయం ఉంటుంది.

ఆ ముగ్గురు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వీళ్ళకి మాయ ఉందా? లేదా? అని పరీక్షించారు, ఆ పరీక్షలో వీళ్ళు నెగ్గారు. కాబట్టే వీళ్ళకి బోధ చేయడానికి ఆ పరమాత్మ దక్షిణం వైపు ముఖం పెట్టుకుని దక్షిణామూర్తిగా కూర్చున్నారు, నలుగురు కూడా ఆయనకి ఎదురుగా కూర్చుని కళ్ళు మూసుకుంటే దక్షిణామూర్తి భౌతికంగా ఏమీ చెప్పలేదట, కానీ ఆయన మౌనంగానే వారికి బోధించాడని చెప్తారు.

మరి అలా బోధ చేసేటప్పుడు మొట్టమొదట సాధన చేసేవాళ్ళు ఎలా ఉండాలి అన్నదానికి ఒక చిన్న ఉదాహరణ చెప్తారు.

ఉదా :- చీకటిగా ఉన్న చోట, చీకటి పోయి వెలుతురు కావాలి అంటే దీపం ఉండాలి. ఆ దీపం కావాలి అంటే ప్రమిద, ఒత్తి, నూనె, వెలిగించేవాడు ఉండాలి. ఈ నాలుగు ఉంటేనే దీపం వెలుగుతుంది.

అలా "నీ హృదయం, అజ్ఞానం అనే అంధకారంలో ఉన్నప్పుడు, జ్ఞానం అనే దీపం వెలగాలంటే నువ్వు హృదయాన్ని సిద్ధం చేసుకోవాలి?

**1. మొదటగా దీపం వెలగాలంటే ప్రమిద కావాలి:**

అంటే సాధకుడికి వైరాగ్యం అనే ప్రమిద ఉండాలి. వైరాగ్యం ఎందుకు? అంటే ఈ ప్రాపంచిక ఆకర్షణలలో పడిపోతే ఎప్పటికీ పరమాత్మ జ్ఞానం పొందడానికి ప్రయత్నించరు. అంటే అన్నీ వదిలేసి వెళ్ళడం కాదు, ఇవన్నీ అశాశ్వతము అనే ఎరుకలో ఉండడమే వైరాగ్యం. సహజంగా అందరూ అన్నీ శాశ్వతము అనే భ్రాంతిలో ఉంటారు. కానీ భ్రమని వీడి ఇదంతా అశాశ్వతమే, ఏది శాశ్వతం కాదు అని ఎప్పుడైతే అర్థం అవుతుందో వాటి వెనకాల పడరు.

ఎప్పుడైతే నీకు ప్రపంచం అశాశ్వతము, పరమాత్మే శాశ్వతుడు అని అర్థమైనప్పుడు, అశాశ్వతమైన ప్రపంచంలో ఉంటారు కానీ దానిలో బంధీ కారు, మమకారం పెంచుకోరు.

**2.దీపం వెలగాలంటే కావలసింది "ఒత్తి" అంటే భక్తి :**

భగవంతుడి మీద ఎందుకు భక్తి ఉండాలి అంటే? ఆయన ఈ సృష్టిని సృష్టించిన సృష్టికర్త కాబట్టి.

భగవంతుడి మీద భక్తి ఎందుకు ఉండాలి అంటే నువ్వు అనుభవిస్తున్న ప్రతి వస్తువు సృష్టించింది ఆయనే. నువ్వు జీవించడానికి కావలసిన గాలి, నీరే కాదు సమస్తము సృష్టించింది ఆయనే. అందుకే అందరూ భగవంతుని ప్రేమిస్తారు. ఆ ప్రేమ భగవంతుడి మీద చూపించడమే "భక్తి".

**3. ఇక దీపానికి కావలసింది నూనె అంటే గురువు చెప్పే బోధ :**

సద్గురువు మాత్రమే నీకు ఆ జ్ఞానం బోధించగలడు. పత్రిగారి స్పీచ్ చూస్తే పరలోకాల గురించి కానీ, మరణం గురించి కానీ, మరణానంతర జీవితం గురించి కానీ ఆయన బోధిస్తారు. అందుకే పరలోక జ్ఞానాన్ని ఇచ్చే గురువే ఉండాలి, అటువంటి జ్ఞాన బోధ పొందాలి.

**4. దీపం వెలగాలి అంటే ప్రమిద, ఒత్తి, నూనె తో పాటు వెలిగించేవాడు వుండాలి :** అంటే వైరాగ్యము, భక్తి, గురుబోధతో పాటు నీకు నువ్వు దీపాన్ని వెలిగించుకోవాలి.

**దక్షిణామూర్తి శిష్యులకు చెప్పింది ఏంటంటే :-**

అజ్ఞానం అనే అంధకారం నీలో ఉన్నప్పుడు ఆ అంధకారాన్ని పోగొట్టుకోవాలి అంటే జ్ఞానం అనే దీపం నీలో వెలగాలి. అంటే నీకు వైరాగ్యము, భక్తి, నీకు నువ్వుగా తెచ్చుకోవాలి. గురువు ఇచ్చే జ్ఞానాన్ని నువ్వు విచారణ చేసినప్పుడు నీవు అద్భుతంగా నీ దీపాన్ని నువ్వు వెలిగించుకోగలవు అని మొట్టమొదట సందేశంగా దక్షిణామూర్తి సనకసనందనాదులకు చెప్పడం జరిగింది.

గురువు నీకు పరలోక జ్ఞానం బోధ చేస్తాడు, కానీ దాన్ని విచారణ చేసుకుంటూ అజ్ఞానాన్ని తొలగించుకుని, జ్ఞానం అనే దీపాన్ని వెలిగించుకోవాలి అని దక్షిణామూర్తి చేసిన భోధ. మరి సనకసనందాదులు ఎంత గొప్పవాళ్ళు అంటే ఆది గురువైన ఈశ్వరుని బోధ వాళ్ళు పొందగలిగారు.

# ధనానికి ఉన్న మూడు గతులు

మనిషికి మూడు గుణాలు లాగే ధనానికి మూడు గతులు ఉన్నాయి.

ఈ ధనానికి ఉన్న మూడు గతులు ఏమిటి అంటే! ఉత్తమం, మధ్యమం, అధమం.

**1. ఉత్తమ గతి: -**

చాలామంది ధనం ఉంటే అన్నీ చేయొచ్చు అనుకుంటారు. కానీ ఆ ధనానికి కూడా యోగం ఉండాలి అంటారు మహాత్ములు. ధనానికి యోగం ఉన్నప్పుడు అది "ఉత్తమ పురుషుడి" చేతుల్లో పడుతుంది.

ధనానికి ఉత్తమగతి పరోపకారం కోసం లేదా ఆధ్యాత్మిక మార్గంలో ఖర్చు పెట్టినప్పుడు కలుగుతుంది. అంటే ఇహలోకానికే కాదు, పరలోకానికి కూడా ఉపయోగ పడతాయి.

ధనం ఉన్నప్పుడు దానధర్మాలు చేస్తూ, యజ్ఞ యాగాదులకు ఖర్చు పెడుతూ, ఆ ధనాన్ని పరోపకారం కోసం, ఖర్చు పెడుతూ వుంటే పుణ్యం వస్తుంది. కానీ ఆధ్యాత్మిక మార్గంలో, అంటే జ్ఞాన మార్గంలో ఖర్చు పెట్టిన ధనం సత్యలోకం వరకు తీసుకువెళ్తుంది.

అందుచేత ఎవరైనా ముక్తి కార్యాలు అంటే ధ్యాన కార్యాలు, ఆత్మ కార్యాలు అంటే సేవలకు ఖర్చుపెట్టిన ధనం ముక్తిని కలిగిస్తాయి అని తెలుసుకోవాలి.

అందుకే పత్రి గారు పాపాలు చేస్తే నరకానికి, పుణ్యాలు చేస్తే స్వర్గానికి, ధ్యానం చేస్తే మోక్షానికి వెళ్తారని చెబుతారు.

అందుచేత జ్ఞానానికి సంబంధించిన సేవలు అంటే ధ్యాన సంబంధమైన సేవలు అంటే ఆత్మ సంబంధమైన సేవలు అంటే భగవంతునికి సంబంధించిన సేవలకు ఖర్చు చేసిన ధనం ఉత్తమ గతికలిగిస్తుంది.

ముఖ్యంగా ధ్యాన యజ్ఞాలకు, ధ్యాన కార్యక్రమాలకు, ఆత్మజ్ఞాన

కార్యక్రమాలకు అంటే అటువంటి కార్యక్రమాలలో చేసే అన్నదానాలకు ఖర్చుచేసే ధనం అలాంటిదే.

అలాగే మామూలుగా చేసే యజ్ఞ, యాగాలకు చేసే ఖర్చు పుణ్యం మాత్రమే వస్తుంది, అది పుణ్య లోకాలకు తీసుకెళ్తుంది.

కానీ కడ్తాల్‌లో జరిగే ధ్యాన యజ్ఞంలో, అలాగే అలాంటి యజ్ఞాలలో అంటే భీమవరంలో జరిగే 3 రోజుల యజ్ఞాలు లాంటి వాటిలో ఉపయోగించే ధనం సత్యలోకానికి తీసుకెళ్తుంది. అక్కడికి వచ్చే ధ్యాన యోగులకు అన్నదానానికి వినియోగించే ధనానికి ఉత్తమ గతిని కల్పించినట్టు అవుతుంది.

అంతేకానీ మీరు దాచుకుని, మీ తరువాత తరాలకి ఇవ్వాలి అని కూడబెడితే ప్రయోజనం ఉండదు. అందుచేత ఉన్నదాంట్లో కొంత అవసరాలు చూసుకుంటూ, కొంత ఆధ్యాత్మిక సేవలకి ఉపయోగించ గలిగితే ఆ ధనానికి ఉత్తమ గతి కల్పించినట్టు అవుతుంది.

అందుచేత ధనం సంపాదించడం గొప్ప కాదు, కానీ ఆ ధనానికి ఉత్తమ గతి కల్పించ గలగడమే గొప్ప. ఆ అదృష్టం ఉత్తమ మనస్తత్వం ఉన్న వాళ్ళకి వుంటుంది.

శుద్ధ సాత్విక దశలో జ్ఞానం తెలిస్తేనే డబ్బుని ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలుస్తుంది. జ్ఞానం లేనప్పుడు డబ్బు భోగాల కోసం అనుకుంటారు. జ్ఞానం ఉంటే ఇది నాకు ఇవ్వబడింది, దీనిని ఇహానికే కాదు పరంలో కూడా ఉపయోగ పడే విధంగా ఉపయోగించాలని అర్థంవుతుంది. అప్పుడు అలా కర్చు చేస్తారు, ఆ ధనం కూడా ఉత్తమగతి పొందుతుంది.

**2.మధ్యమ గతి:-**

కేవలం ప్రాపంచిక భోగాల కోసమే ఖర్చు పెట్టే ధనం మధ్యమ గతి ధనం. పెద్ద కార్లు, పెద్ద మేడలు , సుఖ సంతోషాల కోసం ఉపయోగిస్తారు, డబ్బుని దానధర్మాలకి ఖర్చుపెట్టరు. ఇక ఇహలోకంలో దానధర్మాలే చేయనప్పుడు పరలోకంలో లాభించే దానికి ఏమిఖర్చు పెడతారువారు. ఎంతసేపూ పుట్టాము,

కష్టపడ్డాము కాబట్టి, మాకు డబ్బు వచ్చింది కాబట్టి, మేము సుఖపడాలి అనే ఆలోచన మాత్రమే వారికి ఉంటుంది.

అందుకని వాళ్ళు సుఖాల కోసం, భోగాల కోసమే ఖర్చు పెడతారు. డబ్బు ఉన్నాక సుఖపడకపోతే ఎలా? అనే ఆలోచనతో వాళ్ళ మటుకు వాళ్లే ఖర్చు పెట్టుకుంటారు. అలా భోగాల కోసం ఖర్చు పెట్టుకున్నాక ఆఖరిలో దానధర్మాలు చేయలేదన్న పశ్చాత్తాపం కలుగుతుంది.

ఎందుకంటే చనిపోయే ముందు అంతా గుర్తుకువస్తూ ఉంటుంది. అప్పుడు వాడు ఏమన్నా మంచి పని చేశానా అని చూస్తే ఒక్క మంచి పని కనబడదు, అప్పుడు బాధ వస్తుంది.

చూడండి "చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఏమిటి?" అందుచేత కాలకముందే కాలకుండా చూసుకోవాలి.

అలాగే వయసంతా అయిపోయాక, భోగాలన్నీ అనుభవించి, రోగాలన్నీ ఒంటి మీదకి వచ్చి, మంచం మీద పడి అయ్యో నేను ఒక్క మంచి పని కూడా చేయలేదే అని అప్పుడు బాధపడడం కాదు, ఇలాంటి కొన్ని విషయాలన్నా తెలుసుకొని, కొన్ని మంచి పనులన్నా చేస్తే ఆ డబ్బుకు ఉత్తమగతి వస్తుంది, అంతేకానీ ఎంతసేపు సుఖపడాలి, సుఖపడాలి అంటూ భోగాల కోసమే ఖర్చు పెడితే అది మధ్యమగతి ధనం అవుతుంది.

**3. అధమ గతి:-**

ధనానికి అధమగతి కల్పించడం అంటే సంపాదించింది పిసినారి తనంగా దాస్తాడు లేదా వ్యసనాలకైనా ఖర్చు పెడతాడు. వ్యసనాలకు ఖర్చు పెట్టిన డబ్బు ఏమైనా లాభం ఉంటుందా? అంటే అది అగ్నిలో పడవేసినట్టే అంటారు, మహాత్ములు.

రూపాయి కట్టలు తీసుకెళ్ళి అగ్నిలో వేస్తే బూడిద ఎలాగ అవుతుందో వ్యసనాలకి ఖర్చు పెడితే అంత వ్యర్థమైపోతుందట. తిరిగి ఏమవుతుంది? పాపం కూడా వస్తుంది, రోగము వస్తుంది, వీటితో పాటు దుఃఖము వస్తుంది.

అందుకే డబ్బు ఉండడం గొప్ప కాదు ఆ డబ్బుని ఎలా ఉపయోగించు కుంటున్నాము అన్నది తెలుసుకోవాలని చెప్తారు.

మహాత్ములు డబ్బు ఉండడం గొప్ప కాదంటారు. డబ్బుని ఉత్తమ కార్యాలకు ఖర్చు పెట్టగలిగితేనే ఆ డబ్బుకి విలువ, లేకపోతే విలువ లేనట్టే. వ్యసనాలకి, త్రాగుడికి ,పేకాటకి జూదానికి, పందాలకి ఖర్చుపెట్టిన ధనాన్ని అధమగతి కల్పించినట్టే.

అందుకే గమనించండి ఇలాంటి వ్యసనాలు ఉన్నవారికి చిట్టచివరన చాలా దుర్భరమైన జీవితం వస్తుంది అంటారు. మంచి పనులు చేసిన వాడికి ప్రకృతి ఎప్పుడు ఇస్తూనే ఉంటుంది. కాని ధనానికి అధమగతి కల్పించినప్పుడు లక్ష్మి నీ దగ్గర నుంచి తప్పుకొని ఉత్తమగతి కల్పించేవాడి దగ్గరికి వెళ్ళిపోతుందట.

అందుచేత సాధన చేసేవాళ్ళు ధనాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలి, అలా తెలుసు కున్నప్పుడు జాగ్రత్తగా ఉంటారు. అందుచేత మహాత్ములు ఏమంటారంటే ఈ ధనానికి ఉత్తమగతి కల్పించకపోతే ఆ వంశంలో ఏదో టైంలో అది మెల్లిగా వెళ్ళిపోతుంది అంటారు.

లోక కళ్యాణం కోసం ఇచ్చే ధనమే ఉత్తమగతి పొందుతుంది. మీ పేరు ప్రతిష్టల కోసం, గొప్పల కోసం చేసే ఏ పని కూడా పైలోకాల్లో జమ అవ్వదు.

ధనమైనా, శక్తి అయినా, దానమైనా ఏదైనా సరే తాహతుకు మించి చేయకూడదు, తాహతుకు తగ్గ చేయాలి. అలా చేసినప్పుడు మీ జీవితం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది.

అందుచేత ఎవరైనా, నా ధనానికి ఉత్తమగతి కలుగుతుందా? లేదా? అన్నది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

# సమర్థులు - అసమర్థులు

ఇప్పుడు సమర్థులు, అసమర్థులు ఎలా ఉంటారో, సమర్థత, అసమర్థత అంటే ఏమిటో తెలుసుకుందాం.

## "సమర్థులు"

సమర్థులు తనకు తెలియకపోతే ఎదుటివాళ్ళని చూసైనా నేర్చుకుని ఆ పనిని పూర్తి చేస్తూ ఉంటారు. ఈ సమర్థత ఉన్న వాళ్లు నాకు తెలియదు, నేను చేయలేను అని ఎప్పుడూ అనరు.

మీరు జ్ఞానులు, అజ్ఞానులు అని చెప్పుకుంటూ ఉంటారు. సమర్థుల్ని జ్ఞానులనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే వీరు జ్ఞానం తెలుసుకున్నాక అజ్ఞానాన్ని వదులు కుంటారు. అలాగే సమర్థత లేనప్పుడు ప్రక్కవాళ్ళని చూసైనా తెలుసుకుని సమర్థతని పొందడానికి ప్రయత్నించాలి.

పుట్టుకతోనే అందరూ జ్ఞానులూ అవ్వరు, తెలివైన వాళ్ళూ అవ్వరు, సమర్థులూ కారు, అందరూ పుట్టుకతోటే ఆధ్యాత్మికంలోకి రారు, రాలేరు కూడా. మరి వారు ఎన్ని పూజలు చేసినా, ఎన్ని ఆరాధనలు చేసినా, ఎన్ని మొక్కులు మొక్కి తీరుస్తున్నా, వారికి అసంతృప్తి మాత్రం పోదు, జీవితంలో శాంతి ఉండదు. మరి అలాంటి వాళ్ళు ఇంకా ఏదో ఉంది అని వెతుకుతారు.

మరి ఏదైనా సరే వెతికినప్పుడే దొరుకుతుంది. ఇది ఇంతేనేమో అని తృప్తి పడినవాడికి ఆధ్యాత్మికంలో ఏదీ దొరకదు. నేను భగవంతుడ్ని చేరుకోవడానికి, ఈ పూజ ఒక్కటే కాదు, ఈ తీర్థాలు తిరగడం ఒక్కటే కాదు, ఇంకా ఏదో ఉంది అని వెతికే వాడికి తప్పకుండా ధ్యాన మార్గం దొరుకుతుంది. అన్వేషించిన వాడికే ప్రతీది దక్కుతుంది అని మహాత్ములు చెప్తూ ఉంటారు.

ధ్యాన జీవితము అనేది ఆషామాషీ జీవితం కాదు. ఈనాటి మానవులు ఏదో ఫ్యాషన్ కోసం ధ్యానము అనుకుంటున్నారు. కానీ ఉపనిషత్తులు చెప్పినట్టు భగవంతుడ్ని చేరుకోవడానికి ఉన్న ఏకైక మార్గం ధ్యానం. మరి అంత

ఆషామాషీగా భగవంతుడు మనకు దక్కుతాడా? అంటే ఎన్నో పరీక్షలు, ఎన్నో కష్టాలు, ఎన్నెన్నో ఓర్చుకుంటూ నేర్చుకోవాలి.

ప్రతీదీ కూడా పరీక్షే. నేను భగవంతుడిని చేరుకునే మార్గంలో ఉన్నప్పుడు విశ్వం నాకు పరీక్ష పెడుతుంది అని సాధన చేసేవాళ్ళు గ్రహిస్తే ఆ పరీక్షలను కూడా దాటుకుంటూ ముందుకి వెళ్ళిపోవచ్చు. మరి ఈ విధంగా ధ్యాన మార్గంలోకి వచ్చాక ఏదైనా సాధించగలము అనే ధైర్యం, ధీమా వస్తాయి.

కొందరు చిన్నప్పటి నుంచి చదువుకోవడం వల్ల చదివి నేర్చుకుంటారు, కొందరు తెలివితేటలతో గ్రహిస్తూ ఉంటారు. మరి చదువు, తెలివితేటలు లేని వాళ్ళు ప్రక్కవాళ్ళని చూసైనా నేర్చుకుంటూ ఉంటారు. నేను ఇంతే అనుకునేవాడు ఏదీ సాధించలేడు. నేను సాధిస్తాను, సాధించగలను, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనుకున్నవాడు ఏదైనా సాధిస్తాడు.

అందుకే ఏ పనైనా మొదలుపెడితే అది ఎంత కష్టమైనా దాన్ని ప్రయత్నించి సాధించగలిగేవాడే సమర్థుడు అని మహాత్ములు చెప్తారు. సమర్థుడు ఇంత చేస్తున్నాను, ఇంకా సాధించలేకపోతున్నాను అని నిరుత్సాహ పడకుండా కష్టపడైనా దాన్ని పూర్తి చేస్తాడు. అసమర్థుడు పని మొదలుపెట్టినా పూర్తి చేయలేడు.

కొంతమంది చూడండి కొంత పని చేసి అలసిపోయి, ఎంత చేసినా ఇంతే కదా అని ఆ పని వదిలేస్తారు. ధ్యానం కూడా కొన్నాళ్లు చేసి ఏ ఫలితాలు రాకపోతే ధ్యానాన్ని వదిలిన వాళ్ళు చాలామంది వున్నారు. గమనిస్తే పూజలు చేసినప్పుడు ఏ ఫలితం లేకపోయినా, రోగాలు వచ్చినా పూజలు మానరు. కానీ ధ్యాన మార్గంలోకి వచ్చాక ఫలితం కనిపించనప్పుడు వెంటనే ధ్యానం వదిలేస్తారు.

మరి ఎవరైతే ఇది సాధించాలి అని ముందుకు వెళ్తారో వారు సమర్థత ఉన్నవాళ్లు. "కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు" అని ఒక రచయిత చెప్పాడు. అంటే మనం కృషి చేస్తే అవ్వని పని వుండదు. ఎవరైతే కృషి చేసి సాధిస్తారో అలాంటి వాళ్ళని సమర్థులు అంటారు.

గొప్ప ఆత్మస్థితిలో ఉన్నవాడే ప్రతీ పనిని ఛాలెంజ్ గా తీసుకో గలుగుతాడు. ఎందుకంటే మీ ముందు ఏ పని ఉన్నా అది ప్రకృతి మీ సమర్థతను బట్టి ఇస్తుంది అని బుద్ధుడు చెప్తాడు. ప్రకృతిని, పరమాత్మని నమ్మినవాడు తనకి ఎంత కష్టం వచ్చినా సరే ఇది నాకెందుకు వచ్చింది? అని బాధపడకుండా నాకు ఇదేదో పరీక్ష, ఈ పరీక్షను నేను దాటగలననే నా ముందుకు వచ్చింది. ఈ పరీక్షని దాటే సమర్థత నాకు ఉంది అని సరియైన సాధకుడు, ఆత్మశక్తి ఉన్నవాడు అనుకుంటాడు.

మరి ఈ సమర్థత ఉండి, ఆసక్తి ఉండి, ఆత్మశక్తిని పెంచుకుని సాధన చేస్తున్నవాడు ప్రతి వాళ్ళలోని మంచినే చూస్తాడు. అందుకే బుద్ధుడు చెప్తాడు ఎదుటివాడిలో 99 తప్పులు ఉన్నా ఒక్క మంచి ఉంటే దాని నుంచి నేర్చుకోవడానికి ప్రయత్నించు అని. ఎదుటివాడి చెడ్డతో నీకు సంబంధం లేదు అంటాడు.

ఎదుటివాడు శత్రువైనా వాడిలో మంచి చూస్తూ ఆ మంచిని నేర్చుకుంటూ ఉండాలి. నీలోని చెడ్డ నీకు మంచిది కాదు కానీ ఎదుటివాడి చెడ్డతో నీకేమీ ప్రమాదం లేదు. ఎందుకంటే నువ్వు సాధకుడివి, సాధన చేస్తున్న వాడివి. సాధన చేస్తూ, ఆత్మ శక్తిని పెంచుకుంటూ, ఆత్మగా ఎదగాలనుకునే వాళ్ళకి ఈ సృష్టి సహకరిస్తుందే కానీ ప్రమాదాన్ని తెచ్చిపెట్టదు. ఇది గ్రహించిన రోజున నువ్వు అందరిలో మంచిని చూస్తూ, ఆ మంచి నీకు అవసరమైతే నేర్చుకుంటూ ఉంటావు.

ఈ సమర్థత ఉన్నవాడు ధ్యానం చేస్తూ, ధ్యాన శక్తిని పెంచుకుంటూ ఆ శక్తిని తన కళ్యాణం కోసం కాకుండా విశ్వ కళ్యాణం కోసమే ఖర్చు పెడతాడు. ఇప్పుడు ధ్యానం చేస్తున్నాను, జ్ఞానం పెంచుకుంటూ మోక్షానికి వెళ్ళిపోతాను అనుకుంటే అది కూడా స్వార్థమే అవుతుంది. మరి ధ్యానం చేసి, ఆ శక్తిని, జ్ఞానాన్ని పొంది, పది మంది కోసం పాటుపడేవాడు సమర్థుడు అని తెలుసు కోవాలి.

అంటే మీ శక్తి మీ కోసమే పరిమితం చేసుకుంటే ఇంకా మీరు

ఎక్కవలసిన మెట్టు ఒకటి ఉంది, ఇంకా మీరు పూర్ణ విజయాన్ని సాధించినట్టు కాదు, పూర్ణజ్ఞానం వచ్చినట్టు కాదు అని మీరు అర్థం చేసుకోవాలి. జ్ఞానం పెంచుకోవాలంటే దానికి ఎంతో సత్ప్రవర్తన, సత్శీలం, ఇంద్రియ నిగ్రహం ఉండాలి, నిష్కామ కర్మ చేయాలి.

జ్ఞానము అనే మూడక్షరాల పదాన్ని పొందడానికి 30 జన్మలైనా తీసుకుని, ఒక్కొక్క వాసన తొలగించుకుంటూ ఉండాలి. మీరు ఇవన్నీ నేర్చుకుంటున్నారు, చేస్తున్నారు, కానీ మీ కోసమే మీరు బ్రతికితే ఇది కూడా స్వార్థపూరిత బ్రతుకే అవుతుంది. సాధన చేసి, జ్ఞానాన్ని పొంది విశ్వానికి ఇవ్వగలిగితే అది పరిపూర్ణ జీవితం, సమర్థవంతమైన జీవితం అవుతుంది.

అందుకే ఏ ధ్యాని కూడా సాధన చేసి ఆ సాధనలో పొందిన శక్తిని విశ్వానికే ఖర్చుపెడతాడు కానీ తన కళ్యాణం కోసం, తన కుటుంబ కళ్యాణం కోసం ఖర్చు పెట్టాలని ఆలోచించడు. విశ్వ కళ్యాణం కోసమే ఆలోచిస్తాడు. అందుకే ఎప్పుడూ కూడా అందరి కోసం కష్టపడే వారిని సమర్థులు అంటారు. మీరు ఏ మహాత్ముల చరిత్ర చూసుకున్నా వాళ్ళందరూ కూడా విశ్వ కళ్యాణం కోసమే పాటుపడ్డారు.

ఒక జ్ఞాని సాధన చేస్తూ శక్తిని, ధైర్యాన్ని పెంచుకుంటున్నప్పుడు తను సాధించలేనిది ఈ సృష్టిలో ఏదీ లేదు అని తెలుసుకోగలుగుతాడు.

మీరు ఎదుర్కోలేనంత కష్టమైన పని ఏదీ మీ ముందుకి రాదట. మీ శక్తికి మించిన సవాళ్లు మీ ముందుకి ఎప్పుడూ రావు. ఇప్పుడు చూడండి మీరు స్కూల్లో చదువుకుంటున్నప్పుడు మీరు ఎల్.కె.జి. చదివితే ఎల్.కె.జి. సిలబస్ నుంచే పేపర్ వస్తుంది, కాలేజీకి వెళ్తే కాలేజీ సిలబస్ నుంచే పేపర్ ఉంటుంది. అంతేకానీ కాలేజీలో ఎల్కేజీ పేపర్ ఇవ్వరు, ఎల్కేజీలో కాలేజీ పేపర్ ఇవ్వరు.

అలాగే మీ శక్తి ఎంత ఉందో మీకు తెలియకపోవచ్చు. కానీ ఈ ప్రకృతికి మీకెంత శక్తి ఉందో తెలుసు కాబట్టి మీ శక్తికి మించిన పరీక్షలు కానీ, సవాళ్లు కానీ, పనులు కానీ మీ ముందుకి ఎప్పుడూ రావు. అందుకే

మీకు ఏదైనా ఒక పని, ఒక సవాలు వస్తే, లేకపోతే ఎవరైనా ఇది చేసి పెట్టు అన్నారు అంటే చేయగలిగే సమర్థత నీకు ఉంది అని అర్థం చేసుకోవాలి.

మరి ముందే అయ్య బాబోయ్! ఈ పని నేను చేయగలనా అని భయపడిపోకూడదు. ఆ భయపడే లక్షణమే అసమర్థత, లేదు నేను చేయగలను అని అనుకుంటే సమర్థత. సమర్థత ఉన్నవాడు ప్రతీ పనిని ప్రయత్నించి సాధిస్తాడు కానీ నిరుత్సాహ పడడు. నిరుత్సాహము అంటే ఇంక నేను చెయ్యలేను, నా వల్ల కాదు అనుకుని మొదలు పెట్టిన పనిని మధ్యలో వదిలేయడం, నిస్పృహ అంటే చేసి అలసిపోయాను అనుకోవడం.

అందుకే మీ జీవితంలో నిరుత్సాహానికి, నిస్పృహకి చోటివ్వకూడదు. అవి సోమరుల లక్షణాలు, సోహం పరుల లక్షణాలు కాదు. సోహం అంటే సో అంటే పీల్చే గాలి, హం అంటే వదిలే గాలి. సోహం పరుడు అంటే పీల్చేగాలిని, వదిలేగాలిని గమనించేవాడు అని. మరి మీరు నేను సోమరిపోతుని కాదు, సోహం పరుడ్ని. నేను "శ్వాస మీద ధ్యాస" పెట్టి అసలైన ధ్యానం చేస్తున్న ధ్యానిని, అనంతమైన శక్తి నాలో ఉంది, ఆ శక్తి వల్ల నేను ఏ కార్యాలైనా సాధించగలను అని తెలుసుకోవాలి.

ఇక్కడ మనోశక్తితో జీవించేవాడు పరిమితమైన పనులు చేస్తాడు. ఆత్మ శక్తితో జీవించేవాడు అపరిమితమైన పనులైనా ప్రయత్నించి అవలీలగా చేయగలుగుతాడు. అంటే ఈ పని నావల్ల అవ్వదేమో అనే నిరుత్సాహం సమర్థులకు ఉండదు.

అందుకే ధ్యానులు ఎప్పుడూ కూడా సమర్థులుగా ఉండాలి కానీ అసమర్థులుగా ఉండకూడదు అంటారు. ఎందుకంటే అసమర్థత అన్నది మనసు యొక్క లక్షణం. దానికి పరిమిత శక్తే ఉంది. ఆ పరిమిత శక్తి వల్ల నేను చేయలేను, నేను సాధించలేను, నా వల్ల అవ్వదు అనే నెగిటివ్ మాటలు వస్తాయి. కానీ ఆత్మశక్తిని పెంచుకుంటున్న ధ్యాని సాధించిన శక్తిని తనకోసమే కాకుండా విశ్వ కళ్యాణం కోసం కూడా ఖర్చు పెడతాడు, ఏ పనినైనా సమర్థతతో చేయగలుగుతాడు.

మరి ఇలాంటి వాడు అందరిని ఒకలాగే చూస్తాడు, అంటే ఆత్మగా చూస్తాడు. కుండలు ఎన్ని ఉన్నా ఉండేది మట్టే, నగలు ఎన్ని ఉన్నా ఉండేది బంగారమే, జీవులు ఎన్ని రకాలుగా ఉన్నా ఉండేది ఆత్మ స్వరూపమే. ఇలా మీరు రూపాలు చూసి ద్వైతంలో జీవించకుండా, ఆ రూపాల వెనకాల ఉన్న దైవాన్ని అంటే ఆత్మనే చూడగలిగితే మీరు శక్తివంతులు అయినట్టే.

ఇప్పుడు చూడండి ఏదైనా ఒక సమస్య ఉంటే ఇది చాలా పెద్ద సమస్య అని కొంతమంది దాని గురించి ఆలోచించడానికి కూడా భయపడతారు, కానీ కొంతమంది దాని లోతుల్లోకి వెళ్లి అసలు సమస్య ఎందుకు వచ్చింది? దీన్ని ఎలా పరిష్కరించాలి? అని ఆలోచించి సమస్యకు కారణం కనుక్కుని పరిష్కరించుకుంటారు. ఈ సమర్థత ఒక్క జ్ఞానికే ఉంటుంది.

మీరు ఎదిగిపోయాము, నేర్చుకున్నాము అని అనుకుంటారు. కానీ ఇంకా ఎదగవలసింది, నేర్చుకోవాల్సింది, తెలుసుకోవాల్సింది, సాధించవలసింది చాలా ఉందని తెలుసుకోవాలి. మీ ముందున్న కర్తవ్యాన్ని, మీ ముందున్న ప్రతి పనినీ మీరు సునాయాసంగా చేయగలిగిన రోజున, ప్రతీ పని మీకు సులువుగా అర్థమైన రోజున, ప్రతీ సమస్యకి పరిష్కారం మీరు కనుక్కున్న రోజున, మీరు జ్ఞానవంతులు, శక్తివంతులు అయినట్టే.

మరి అంత సమర్థత మీరు సాధించాలంటే ఎంతో సాధన, సజ్జన సాంగత్యం, స్వాధ్యాయం మీకు ఉండాలి. సాధకుడు ఎదిగాను అని అనుకోవడం కాదు. ఇంకా ఎదగాలి అని అనుకోవడమే అసలైన ఎదుగుదల. ఎదిగితే, అన్నీ తెలిస్తే ఇంక భూమిమీద ఉండడం ఎందుకు?

ఇంకా నేర్చుకోవాల్సింది ఉంది, ఇంకా ఎదగాల్సింది ఉంది, ఇంకా తెలుసుకోవాల్సింది ఉంది, మరి ఇవన్నీ తెలుసుకోవడానికే భూమిమీదకి వచ్చామని తెలుసుకోవాలి. వినయం ఉన్నప్పుడే ఈ ప్రకృతి మీకు అన్ని విధాలా సహకరిస్తూ, మీ సమర్థతని ఇంకా పెంచుతుంది.

మీరు చేయవలసింది ఒకటే. సాధన చేస్తూ, శక్తిని పెంచుకుంటూ, ప్రకృతికి, పరమాత్మకి, గురువుకి విధేయుడిగా ఉంటూ, అన్నీ నేర్చుకోవాలని,

జ్ఞానం పెంచుకోవాలని, పెంచుకున్న జ్ఞానాన్ని పది మందికీ పంచాలి అనే తపన ఉన్నప్పుడే మహాత్ముడిగా ఎదగగలుగుతారు.

## "అసమర్థులు"

ప్రయత్నించకుండానే నావల్ల కాదు, నేను చేయలేను అంటున్నారంటే కొంచెం సోమరితనమైనా అయి ఉండాలి, అహంకారమైనా అయి ఉండాలి, మూర్ఖత్వమైనా అయి ఉండాలి, అజ్ఞానమైనా అయి ఉండాలి. మరి ఇలాంటి గుణాలు ఉన్నవాళ్ళని అసమర్ధులు అంటారు.

అంటే వీరు దేనికీ ప్రయత్నించరు, వీళ్ళలో సమర్థత వుండదు. సమర్థత లేకపోయినా సమర్థతను సంపాదించాలి అనుకునే వాళ్ళు భూమి మీద చాలా తక్కువ మంది ఉంటారు. అంటే లోకంలో అందరూ యోగులు అయితే అంతా సమర్ధత కలిగిన వాళ్లే ఉంటారు. అందరూ ఆత్మలే అయినా వాళ్ళ వాళ్ళ ప్రయత్నాన్ని బట్టి, కృషిని బట్టి సమర్థతని సంపాదించుకుంటారు.

అంటే ఎవరైతే వాళ్ళకి ఆ శక్తి లేకపోయినా శక్తిని సంపాదించుకుని చేసే పనిని సాధిస్తారో వాళ్ళు సమర్ధులు. మరి అసమర్ధులు ఎలా ఉంటారంటే? నా కర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది, లేదా నా అదృష్టాన్ని బట్టి జరుగుతుంది. అంతేకానీ నేను ప్రయత్నిస్తే అయిపోతుందా? అని ప్రయత్నించరు. అంటే చేతకానితనాన్ని ఒప్పుకోవడం, అదృష్టం మీద ఆధారపడటం ఇది చాలా అసమర్థత.

అదృష్టం ఉండొచ్చు కానీ ప్రయత్నమే చేయకపోతే వాడు చాలా అసమర్ధుడు అని అనుకోవచ్చు. అదృష్టం మీద ఆధారపడినవాడు అశక్తుడు, ఏమీ చేయలేనివాడు. ఎందుకంటే ప్రతి చోట అదృష్టం కలిసి రాదు,

అందుకే అదృష్టాన్ని నమ్ముకున్న అజ్ఞాని అసమర్ధుడు అవుతాడు. ప్రయత్నించి ఫలితాన్ని సాధిద్దాము అనుకున్న వాడు సమర్ధుడు అవుతాడు.

కొంతమంది అసమర్ధులు నా కర్మ ఎలా ఉంటే అలా జరుగుతుంది అని అదృష్టం కోసం ఎదురు చూస్తారు. వీళ్ళు "మొట్టమొదటి రకం" అసమర్ధులు. మరి వీళ్ళని మూర్ఖులు అనొచ్చు.

ఇక “రెండో రకం వాళ్ళు” నాకన్నీ తెలుసు, ఎవరూ నాకు చెప్పక్కర్లేద్దు అని అహంకారంతో ఉంటారు. కొంతమందికి ఎదుటివాడు చెప్పింది నచ్చదు. వాళ్ళ కింద వాళ్ళు చెప్పినా, భార్య చెప్పినా అసలు వినరు. నాకంటే నీకు ఎక్కువ తెలుసా? నువ్వు నాకు సలహా చెప్పే అంత దానివా? అంటూ ప్రతి విషయంలో కించపరుస్తూ ఉంటారు. వాడు చెప్పేది నేను ఆచరించాలా? నాకు తెలియదా? అంటారు.

ఇంకొంతమంది తన క్రింద ఉద్యోగస్తులు కానీ, తనకంటే డబ్బులేని వాళ్ళు కానీ, పేరు ప్రఖ్యాతులు లేని వాళ్ళు కానీ ఒక మంచి సలహా ఇచ్చినా నాకు వీళ్ళు సలహా ఇచ్చేది ఏంటి? నేను ఇంత గొప్పోడిని కదా? వాళ్ళ సలహాలు పాటించాల్సిన అవసరం నాకు లేదు, నేను ఎవరి మాట వినను అని అహంకారంతో ఉంటారు. మొదటివాడు మూర్ఖుడైతే, వీడు అహంకారి. అహంకారంతో ఏ పనీ చేయడానికి ప్రయత్నించరు.

ఇప్పుడు పత్రిగారు వచ్చి పూజల కంటే ధ్యానం గొప్పది అని చెప్పారు. అలా చెప్పినప్పుడు  ఇప్పుడంటే ధ్యానాలు వచ్చాయి, పూర్వం నుంచి పూజలు లేవా అని ఇప్పటికీ పూజలు వదలని వాళ్ళు చాలామంది ఉన్నారు. ఎందుకంటే వాళ్ళకి ఏదో ఒక మూల అహంకారం వుంటుంది. అహంకారికి ఆత్మజ్ఞానం అబ్బదు అని మన ఉపనిషత్తులు చెప్పాయి. వీసమెత్తు అహంకారం ఉన్నా ఆత్మజ్ఞానాన్ని తెలుసుకునే పరిస్థితి, వాళ్ళకి ఎప్పటికీ కలగదు.

అందుకే గురువు ఎప్పుడూ కూడా శిష్యుల యొక్క అహంకారాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తాడు. ఎందుకంటే వీళ్ళు ఏ పని చేయకుండా అహంకారాన్ని పెంచుకొని అసమర్థులుగా మిగిలిపోతారని గురువు వాళ్ళ అహంకారాన్ని తగ్గిస్తారు. కానీ ఆత్మజ్ఞానం వినక, గురువు దగ్గరికీ వెళ్ళక నాకు అన్నీ తెలుసు అనే అహంకారంతో ఉన్న వారిని ఎవ్వరూ ఆ జన్మకి బాగు చేయలేరు.

“మూడవ రకం” వాళ్ళు అందరూ నా మాటే వినాలి కానీ అందరి మాట నేను వినను. నాకు నచ్చింది నేను చేస్తాను, నా ఆలోచనలన్నీ కరెక్ట్,

నాకు ఇప్పటి వరకు అన్నీ సక్సెస్ అయ్యాయి. నేను చేశాను అంటే సక్సెస్ అవుతుంది అంటారు. ఇది ఇంకొక రకం గర్వం. అంటే నేను అని ఎప్పుడైతే అంటాడో ఈ దేహ స్థితిలోనే ఉన్నాడు అని అర్థం చేసుకోవాలి.

అంటే ఇది నాకు తెలుసు, నేను చేసిందే అందరూ చేయాలి అని ఆలోచిస్తూ ఉంటారు. అంటే నేను ఏం చేసినా గొప్పగా చేస్తాను. అందుకే నేను చెప్పిన మాట అందరూ వినాలి అని అనుకోవడం దేహ స్థితే. ఆ దేహ స్థితిలో నా మాటే శాసనం అని అనుకుంటూ ఎవరు చెప్పినా, ఎవరు మాట్లాడినా ఆ మాటలు వినడానికి కూడా ప్రయత్నించరు.

ఇక "నాలుగో రకం వాళ్ళు" నా పద్ధతి ఇంతే, మా సాంప్రదాయం ఇంతే, మేము ఇలాగే ఉంటాం. ఈ పద్ధతే అనుసరిస్తాం అని సాంప్రదాయాన్ని గౌరవిస్తూ ఉంటారు. సాంప్రదాయాన్ని గౌరవించడం కరెక్టే కానీ అది దేశ, కాల, మాన పరిస్థితులని బట్టి మార్చుకోవాలి.

కానీ పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయాలు అనుకుంటూ, వాటినే గౌరవిస్తూ, వాటినే పాటిస్తే కొన్ని కొన్ని సార్లు అసమర్థుడిగా మిగిలిపోతారు.

ఇప్పుడు చూడండి కొన్ని సంవత్సరాల క్రితం జంతు బలులు ఇస్తూ ఉండేవారు. ఆ బలులు ఇస్తూ ఎన్నో జీవులని చంపుతూ ఉండేవారు. అప్పుడు అది సాంప్రదాయంగా రావచ్చు, కానీ తెలియని స్థితిలో తప్పు చేసినా ఇప్పుడు అన్ని జీవులూ పరమాత్మ స్వరూపాలే అని తెలుసుకుని మార్చుకోవాలి.

అందుకే "సాంప్రదాయాలని ధిక్కరించినవాడే మహాయోగి కాగలడు" అని చెప్తారు. మరి సాంప్రదాయాలకు కట్టుబడి ఉంటే నువ్వు ఇంకా అసమర్థుడవే! దేశకాలమాన పరిస్థితులను బట్టి సాంప్రదాయాన్ని ధిక్కరించాలి. మరి యజ్ఞాల్లో పశువుల్ని బలి ఇస్తుంటే బుద్ధుడు ఆ యజ్ఞాలు చేయకుండా ఆపించడం జరిగింది.

కానీ ఇప్పటికీ జంతు బలులు ఇచ్చే సంప్రదాయాలని పాటిస్తూ ఇది మా పద్ధతి, మా ఊరి ఆనవాయి, మేమిలాగే చేయాలి, మేము మారము, మారితే ఊరికి అరిష్టం జరుగుతుంది అని భయపడుతూ ఉంటారు. ఒకవేళ

మీరు చెప్పడానికి వెళ్తే కొట్టడానికి కూడా వస్తారు. అంత మూర్ఖత్వంలో వుంటారు.

అంటే అపాయం వచ్చినా సాటి జీవి మరణించకూడదు అనేవాడు సమర్థుడు. అపాయానికి భయపడి తన సుఖం కోసం, తన సంతోషం కోసం, తన సాంప్రదాయం కోసం ఎదుటివాటిని హింసించేవాడు అసమర్థుడు.

ఇక "ఐదవ రకం వాళ్ళు". ఎవ్వరు చెప్పినా వినను అని తన మాటలకి, చేతలకి కట్టుబడిపోతాడు. మరి ఇప్పుడు చూడండి చాలామంది పూజలు చేస్తూ పూజల్లో నుంచి బయటికి రాలేకపోతున్నారు.

అంటే అంతవరకు ఆలోచించే సమర్థత వీరికి లేదు. వాళ్ళు చదువుకోలేదు, వినలేదు. పూర్వం నుంచి అదే సాంప్రదాయం. అందుకే పూజ అంటే చాలా ఇంట్రెస్ట్ గా కూర్చుంటారు, ధ్యానమనగానే లేచి వెళ్ళిపోతారు.

ఇక "ఆరవ రకం వాళ్లు" ధ్యాన మార్గం అన్నది మోక్షానికి దారి తీస్తుంది అని చెప్పినా మొదలు పెట్టరు. నా బాధ్యతలు తీరాలి అంటారు. వాళ్ళ యోగ క్షేమాల కోసం ధ్యాన సాధన చెప్పినా సరే వాళ్ళు ఆచరించగలిగే స్థితిలో ఉండరు. బాధ్యతలు తీరితే ఒక నాలుగైదేళ్ళ తర్వాత చేసుకుంటాను అని వాయిదాలు వేస్తూ ఉంటారు. ఇలా అసమర్థులు ఆరు రకాలుగా ఉంటారు.

మరి ఇవన్నీ కూడా సోమరిపోతుల లక్షణాలు, బద్ధకస్తుల లక్షణాలు, తమోగుణ లక్షణాలు. వీటిని మీ దరిదాపుల్లోకి  కూడా రానివ్వకుండా ఉండాలి. వాడు ఎంత ఐశ్వర్యవంతుడవ్వనివ్వండి, ఎన్ని పదవులు పొందనివ్వండి, జనం బలం, ధన బలం ఉండనివ్వండి, ప్రక్కవాడి మీద ఆధారపడుతూ తన స్వశక్తిని ఖర్చుపెట్టకుండా ఉంటే వాడు భగవంతుడు దృష్టిలో అసమర్థుడే.

అందుకే భూమిమీద అవకాశాలు అందరికీ ఇవ్వబడతాయి. కానీ ఆ అవకాశాలని ఉపయోగించుకోవడం తెలియాలి. అది సమర్థులకే తెలుస్తుంది. మరి ఎవరి జీవితంలోకి గురువు వస్తాడో, వాళ్ళు సత్యం అంటే ఏమిటో తెలుసుకుంటారు, జీవుడు అంటే ఏమిటో తెలుసుకుంటారు, దేవుడు అంటే ఏమిటో తెలుసుకుంటారు.

ఇక్కడ సాధకులు భూమి మీదకి ఎదుగుదల కోసమే వచ్చాము అని ప్రతి క్షణము గుర్తుంచుకోవాలి. అలా వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఉపయోగించు కుంటూ, ప్రయత్నిస్తూ, నేర్చుకుంటూ ఎదుగుతూ ఉండాలి. అలా నేర్చుకోవడం మీద దృష్టి పెట్టి, తన శక్తిని పెంచుకోవడానికి అవకాశాలు వస్తున్నాయని అర్థం చేసుకుంటూ తన సమర్థతని వృద్ధి చేసుకునేవాడు నిజమైన సాధకుడు.

ఈ భూమిమీద సాధన ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. మూర్ఖత్వం, మొండిపట్టుదల, అజ్ఞానం, అహంకారం తొలగించుకుని గురువు చెప్పిన సాధన చేసి అందరూ ఆత్మ స్వరూపులే అని తెలుసుకున్నప్పుడు ప్రతి వాడికి ఎదగడానికి ప్రకృతి అవకాశం ఇస్తుంది.

రత్నాకరుడు వాల్మీకి అయిన నేల ఇది. మరి జీవుడిగా పుట్టి దేవుడిగా ఎదిగిన ఎందరో మహాత్ములు పుట్టిన ఈ భూమిమీద మీరు కూడా జీవుడిగా ఉన్నా సాధన, జ్ఞానం నేర్చుకొని, అసమర్థుడిగా మిగిలిపోకుండా సమర్థుడిగా ఎదగడమే మీ జన్మ లక్ష్యం.

అందుకే అసమర్థత ఎన్ని రకాలుగా ఉంటుందో మనకు తెలియచెప్పిన మహాత్ములు, సమర్థత  పెంచుకున్నప్పుడే, సమర్థులు అయినప్పుడే విశ్వం నీకు గురువు అయ్యే అవకాశం, ఎవరికైనా చెప్పే అవకాశం ఇస్తుంది. మీలో సమర్థత లేకపోతే మీరు ఇంకొకళ్ళకి చెప్పే అవకాశం ఇవ్వదు.

ఇప్పుడు మీలో చాలామందికి క్లాసు చెప్పినప్పుడు వాళ్ళు పొగిడారు, వీళ్ళు పొగిడారని మీకు చాలా అహంకారం వస్తూ ఉంటుంది. ఇక్కడ ప్రకృతి నీకు ఎప్పుడూ పరీక్షలు పెడుతూనే ఉంటుంది. నీ ఎదురుగుండా కూర్చున్న వ్యక్తులను బట్టి నీ శక్తి ఎంత పెరుగుతుందో నువ్వు లెక్కేసుకోవచ్చు.

అంటే ఈరోజు నా ఎదురుగా 10 మంది కూర్చుని క్లాస్ వింటే నా శక్తి అంతే, మరి ఇంకొక రోజు 100 మంది కూర్చోవచ్చు. అంటే నీ శక్తి పెరుగుతున్నట్టు. మరి పెరిగిందని అహంకారం పెంచుకోకు. ఇంకా జ్ఞానం పెంచుకోవడానికి ప్రయత్నించు. నీకు అర్థం కానిది నీకు తెలియంది ఈ

భూమిమీద ఏదీ ఉండదు. ఎందుకు ఉండదు అంటే నువ్వు ఆత్మవి. సాధన చేసి మనోస్థితిని తగ్గించుకొని ఆత్మ శక్తిని పెంచుకుంటే అసమర్థుడు కూడా సమర్థుడు అవుతాడు.

మనోస్థితిలో ఉన్నప్పుడు నేను చేయలేను, నాకు చేత కాదు, నా వల్ల కాదు, నేను ఇంతే, నేను ఇలాగే ఉంటాను అనుకుంటావు. ఆత్మ స్థితికి ఎదిగిన వాడు నేను చేయగలను, నాకు తెలియకపోయినా నేర్చుకునైనా చేస్తాను, కానీ చేసి తీరుతాను అని ప్రయత్నిస్తాడు. మరి ఇది తెలుసుకుంటే మీరు ముందు అసమర్థతతో ఉన్నా, సాధన చేసి సమర్థవంతమైన జీవితాన్ని జీవించడానికి అవకాశం ఉంటుంది.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# ఆత్మ దర్శనం కావాలంటే, మనం అనుకున్నది సాధించాలంటే మనలో ఎటువంటి శక్తులు ఉండాలి?

ప్రతి వాళ్ళకి కొన్ని సంకల్పాలు ఉంటాయి, కోరికలూ ఉంటాయి. కష్టపడకుండా రావాలి అనుకోవడం కోరిక అయితే, ఆ కోరిక నెరవేర్చుకోవడం కోసం కొంచెం ప్రయత్నం చేస్తే దాన్నే సంకల్పము అంటారు.

అంటే చూడండి రోజూ సాధన చేస్తూ కొంచెం జ్ఞానం పెరగాలి అని అనుకున్నది మన సంకల్పం అవుతుంది. ఎందుకంటే మనం ఊరికే కూర్చోట్లేదు. ఊరికే కూర్చుంటే ఏదీ రాదు అని మనకు తెలుసు. అందుకే ఆత్మ దర్శనం కావాలి, జ్ఞానం పెరగాలి, మోక్షం రావాలి అని ధ్యానం చేస్తూ ప్రయత్నిస్తున్నాం. మరి గట్టి ప్రయత్నం ఉంటే సంకల్పం నెరవేరుతుంది.

మన సంకల్పాలు నెరవేరడానికి కానీ, ఆత్మశక్తి పెరగడానికి కానీ కావలసింది ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి. ఈ మూడు శక్తులు ఉంటేనే అనుకున్నది సాధించగలరు.

అందుకే లలితా సహస్రంలో కూడా ఇచ్ఛాశక్తి క్రియాశక్తి, జ్ఞానశక్తి స్వరూపుణే లలితాదేవి అని చెప్తారు. ఈ మూడు ఉన్నప్పుడే అమ్మ యొక్క అనుగ్రహం మనకి కలుగుతుంది అని చెప్తారు.

**1) ఇచ్ఛాశక్తి :**

ఇచ్ఛాశక్తి అంటే ప్రాపంచిక ఇచ్ఛ కాదు. ప్రాపంచిక కోరికలు కాదు. మనం పురాణాలు చదివినా, స్తోత్రాలు చదివినా, పారాయణాలు చేసినా అవన్నీ ప్రాపంచిక జీవితానికి ఇవ్వలేదు, మన ఆధ్యాత్మిక ఎదుగుదలకే వాళ్ళు రాసి ఇచ్చారు అని ప్రతి ఒక్కరికీ కూడా తెలియాలి.

ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక జీవితంలోకి రాకముందు శరీరము, మనసు, ప్రపంచము గొప్పది అనుకుంటారు. కానీ ఈ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక అవి అల్పమైనవని ఆత్మే గొప్పదని తెలుసుకుంటారు. ఆత్మే భగవంతుడని, ఆత్మ సర్వత్రా అంటే సృష్టి అంతా ఉందని, సర్వ జీవులలోనూ అంటే 84 లక్షల జీవరాశుల్లోనూ ఉంది అని, ఆ ఆత్మని తెలుసుకుంటేనే మోక్షమని మనకి

తెలియాలి. తెలిసినప్పుడే ఆ ఆత్మ మీద అంటే భగవంతుని మీద ఇష్టాన్ని పెంచుకుంటారు. అదే ఇచ్ఛాశక్తి.

ఆ భగవంతుడికి మనకంటే ముందు ఉన్న మహానుభావులు ఆత్మ అనే ఒక పేరు పెట్టారు కానీ నిజంగా భగవంతుడికి ఒక పేరు అన్నది లేదు, అన్ని పేర్లూ ఆయనవే. ఉన్నది సర్వత్రా చైతన్య స్వరూపమే. కొందరు ఈశ్వరుడి చైతన్యమే సృష్టి అంతా ఉంది అన్నారు కానీ మళ్లీ ఒక పేరు పెట్టుకుంటే మన ఆలోచనలు వేరుగా ఉంటాయని ఋషులు భగవంతుడికి ఆత్మ అనే పేరు పెట్టారు.

మరి సర్వత్రా ఉన్న ఆత్మ మనకి తెలియట్లేదు కాబట్టి తెలుసుకోవాలి అనే కోరిక మనకి ఉండాలి. సృష్టిలో అన్నిటికంటే గొప్పవాడు భగవంతుడే కాబట్టి ఆయన్ని తెలుసుకోవడానికే మనం ప్రయత్నం చేయాలి.

ఎందుకంటే ఆనందం అంతా భగవంతుడి దగ్గరే ఉంది. ఆ భగవంతుని తెలుసుకోలేకే మానవులు దుఃఖంలో ఉంటున్నారు. మరి ఒక్క మానవ జన్మే భగవంతుడ్ని తెలుసుకునే ఏకైక జన్మ అని తెలుసుకుని కూడా ప్రయత్నం చేయకపోతే మనకి ఆనందం ఎక్కడి నుంచి వస్తుంది? ఎక్కడైతే ఆనందం ఉందో అక్కడ వెతుక్కోవాలి. మరి ప్రాపంచిక జీవితంలో ఆనందం లేని చోట ఆనందం వెతికారు. కానీ ఇప్పుడు ఆధ్యాత్మిక జీవితంలో ఆనందం ఉన్నచోటే ఆనందం కోసం ఎలా వెతుక్కోవాలో గురువు ద్వారా తెలుసుకున్నాం.

ఎందుకంటే మన జీవితంలోకి సాధన అనేది గురువు ద్వారానే వస్తుంది కానీ పుస్తకాల ద్వారా ఎంత నేర్చుకున్నా మనం ఎదగలేము. ఎందుకంటే గురువు అనుభవ జ్ఞానం ఉన్నవాడు. అంటే మీరు క్లాసులో ఎన్ని పాఠాలు విన్నా ల్యాబ్ కి వెళ్లి ప్రాక్టికల్ చేస్తే కానీ దాని రిజల్ట్ కరెక్ట్‌గా మీరు ఎలా తెలియదో అలాగే ఎన్ని పుస్తకాలు చదివినా మీకు పండిత జ్ఞానమే వస్తుంది కానీ పరమాత్మ జ్ఞానం రాదు.

పండిత జ్ఞానం అంటే చదివింది విని అవగాహన చేసుకుని చెప్పేస్తామే కానీ అనుభూతి, అనుభవం రెండూ రావు. అందుకే మీరు భగవంతుడు

గొప్పవాడని ఒప్పుకుంటారు కానీ ఎంత గొప్పవాడో తెలియాలి అంటే ఆధ్యాత్మిక జీవితంలోకి వస్తేనే తెలుస్తుంది.

ప్రాపంచిక జీవితంలో కోరికలు తీర్చేవాడు భగవంతుడు అనుకున్నాం. కానీ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక కోరికలు తీర్చేవాడే కాదు సృష్టి అంతా తానే ఉన్నాడు, సకల జీవులలోనూ తానే వుండి సృష్టిని నడిపిస్తున్నాడు అనే పరమసత్యం తెలుసుకున్నారు.

మీరు శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని వాడేస్తారు. ఎందుకు కుట్టదు అంటే? ఆయన చైతన్యం లేని చోట సృష్టే లేదు కాబట్టి. ఉన్నదంతా ఆయన చైతన్యంతోనే నడుస్తుంది కాబట్టి. మరి అటువంటి గొప్ప పరమాత్మని నేను తెలుసుకోవాలి అని ఇచ్ఛ మనకి ఉండాలి. ఎంత ఇష్టంగా ఉంటామో మీకు అంత శక్తి. ఎంత శక్తి పొందుతామంటే? ఆ ఇష్టాన్ని ప్రాక్టికల్ గా ప్రయోగిస్తాము.

ఇష్టంగా తెలుసుకోవాలనుకునే వాడికే ఆత్మ లభ్యమవుతుంది. ఏదో కోరిక తీరుతుంది, ప్రశాంతంగా ఉంటుంది, లేదా ఇది వస్తుంది అది వస్తుందని అనుకుంటే అది భగవంతుడి మీద ఇచ్ఛ కాదు. అది ఆయన ఇచ్చే వాటి మీద ఇష్టం. ఎంతగా నువ్వు భగవంతుని ఇష్టపడతావో అంతగా నీకు ఆయన చేరువ అవుతాడట.

కోరికలతో ఉన్నవాడికి దూరమైపోతాడు. ఆయన్నే కోరుకున్న వాడికి దాసుడవుతాడు అని మహాత్ములు చెప్తారు. అందుకే నీలో ఇచ్ఛాశక్తి ఎంతగా పెరుగుతుందో నీకు ఆత్మ అంత దగ్గరైపోతూ ఉంటుంది.

**2. క్రియాశక్తి :**

అంటే ఆత్మను తెలుసుకోవాలనే తపన నీకు ఎంతగా ఉంటే ఆ తపనను బట్టి మార్గం చూపించడానికి భగవంతుడే ఒక్కొక్కసారి గురు రూపంలో వచ్చి బోధ చేస్తాడట. అన్నమాచార్యుల వారికి వెంకటేశ్వర స్వామే వచ్చి ఎలా చెప్పాడో అదే విధంగా మనకి కూడా భగవంతుడ్ని తెలుసుకోవాలి అని తపన ఉంటే ఆ పరమాత్మే సద్గురువు రూపంలో వచ్చి సరైన మార్గం చెప్తాడు. అలా

బోధించినప్పుడు ఆ సాధనని అశ్రద్ధ చేయకుండా శ్రద్ధతో నువ్వు రోజూ చేసే ప్రయత్నాన్నే క్రియాశక్తి అంటారు.

ఇక్కడ క్రియ అన్నా, కర్మ అన్నా పనే. కానీ రెండూ వేరు. కర్మ మన ప్రయత్నంతో చేసే పని. అంటే ఈ పని చెయ్యాలి, ఆ పని చెయ్యాలి అని అనుకుని అప్పుడప్పుడు చేసేది కర్మ అయితే నిరంతరము పని చేసేది క్రియ. ఉదాహరణకి మన శరీరంలో నిరంతరము శ్వాసక్రియ పనిచేస్తుంది. అంటే మనం శ్వాస తీసుకుంటూనే ఉంటాం. అలాగే జీర్ణక్రియ. మనకు తెలుసున్నా తెలియకపోయినా మన లోపల ఉన్న లివర్ అలా అరిగిస్తూనే ఉంటుంది. అలా ఆగకుండా నిరంతరము జరిగేదాన్ని క్రియాశక్తి అంటారు.

ఇప్పుడు మనకి భగవంతుడ్ని తెలుసుకోవాలి, అనే కోరిక నిరంతరము ఉండాలి. మరి ఆ కోరిక ఎంతగా ఉంటుందో మన ప్రయత్నము కూడా అంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు మనం అనునిత్యం చేస్తున్నది అదేనండి. క్రియాశక్తే. మనం ప్రతిరోజూ ఆపకుండా చేస్తున్నాం, ఖాళీ దొరికినప్పుడల్లా చేస్తున్నాం. అందుకే వారు  ఆత్మే భగవంతుడు అనే ధ్యాసలోకి వచ్చారు.

ఒకవేళ విగ్రహం చూసినా అది విగ్రహం అంటున్నాం కానీ దేవుడు అనట్లేదు. ఎందుకంటే పత్రిగారు వచ్చాక మనకి సత్యం తెలిసింది. దేవుడు ఆత్మగా లోనే ఉన్నాడు అని తెలుసుకున్నాం. శ్వాస మీద ధ్యాస పెట్టి లోనికి నిరంతరము ప్రయాణం చేసినప్పుడే నువ్వు కోరుకున్న భగవంతుడు నీకు దక్కుతాడు అని చెప్పినప్పటి నుండి మీరు ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

ఇంకొకటి గమనించండి కూర్చుని కళ్ళు మూసేసుకుని "శ్వాస మీద ధ్యాస" పెట్టినప్పుడు తీవ్ర ప్రయత్నం అవుతుంది. అలాగే నిరంతరము మన మాటల్లో, చేతల్లో, జ్ఞానం పెంచుకోవాలనే కోరిక ఉండి, ఆత్మే భగవంతుడు అనే ధ్యాసలో ఉంటే అది కూడా ధ్యానమే. నీ ధ్యాస ఎప్పుడు ఆత్మ మీద నుంచి పోకుండా ఉంటే నువ్వు కళ్ళు మూసుకునే ఉండక్కర్లేదు.

అది ఎలా ధ్యానం అవుతుందని అన్నదానికి మీకు ఒక చిన్న ఉదాహరణ చెప్తాను. ఒకసారి రమణ భగవానుడి ఆశ్రమంలో ఒక శిష్యుడు

ఎప్పుడూ పనులు చేస్తూనే ఉండేవాడట. అలా చేస్తూ ఉంటే ఇంకొక శిష్యుడు రమణ భగవాన్ దగ్గరికి వెళ్లి స్వామీ అతను అసలు ధ్యానమే చేయట్లేదు, ఎప్పుడూ ఏదో ఒక పనిలో ఉంటున్నాడు. మరి ఎలా ఎదుగుతాడు? వాడికి కొంచెం సేపైనా ధ్యానం చేయమని మీరు చెప్పండి అన్నాడు.

అప్పుడు రమణ భగవానుడు నువ్వు అప్పుడప్పుడు చేస్తున్నావు, వాడు నిరంతరము ధ్యానము చేస్తున్నాడు అన్నాడు. అంటే ఏంటి? స్వామిని భగవంతుడిగా చూసుకున్నాడు, ఆత్మగా చూసుకున్నాడు. ఆశ్రమంలో ప్రతీ పని స్వామిదే, ప్రతీ పని నాదే అనే భావంతో చేస్తున్నాడు. నిరంతరము అన్ని చోట్ల భగవంతుడ్ని చూస్తున్నాడు. మీరు చెప్పడానికి సర్వం ఖల్విదం బ్రహ్మ అని చెప్పేస్తారు. కానీ అక్కడ చెత్త ఉంటే కూడా ఊడ్చరు. ఎందుకు అంటే అది చెత్తగానే చూస్తున్నారు కాబట్టి.

కానీ ఆయన ఏమనుకుంటున్నాడు? ఎక్కడ ఏది ఉన్నా అది భగవంతుడి పనే అనుకుంటూ, చేసుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అంటే వాడు నిరంతరము ఆత్మ స్థితిలో, ధ్యాన స్థితిలో ఉన్నాడు. నువ్వు అప్పుడప్పుడు ధ్యానం చేసినప్పుడే ఆత్మ భగవంతుడు అనుకుంటున్నావు. నేను కూడా ఒక్కొక్కసారి మా రాఘవరావుగార్ని ధ్యానం చేయొచ్చు కదా! ఎందుకు చేయరు? అని అడిగేదాన్ని. కానీ ఈ ఉదాహరణ విన్న తర్వాత నాకు అర్థమయింది.

నేనే అప్పుడప్పుడు చేస్తున్నాను. ఆయన నిరంతరం ఆ స్థితిలోనే ఉన్నారు అని. ఎందుకంటే ఆయనకి నిరంతరము ఇదే తపన. ఏ కొత్త ప్రాజెక్ట్ పెట్టాలి? ఏ కొత్త కాన్సెప్ట్ మీకు చెప్పాలి? మిమ్మల్ని ఎలా ఇంకా ముందుకు తీసుకు వెళ్ళాలి? ఇదివరకు త్రీ డేస్, వన్ డేలు పెడితే, ఆ తర్వాత కరోనా టైంలో జూమ్ లు పెట్టారు. మళ్ళీ మధ్యాహ్నం, సాయంత్రం జూమ్లు స్టార్ట్ చేసారు.

ఎప్పుడూ అందరి కోసం ఏ ప్రాజెక్ట్ పెట్టాలి? ఇంకా జనాల్లోకి ఈ ధ్యానం ఎలా తీసుకు వెళ్ళాలి? అని ఆలోచిస్తారు. మరి ఇంట్లో ఉన్నప్పుడు, ఊర్లు వెళ్ళినప్పుడు, ట్రైన్ లో కూడా పుస్తకాల కరెక్షన్ చేస్తూ ఇంకా కొత్త

పుస్తకాలు జనాలకి అందించాలి అనుకుంటున్నారు. అలా నిరంతరము ఆలోచిస్తున్నారంటే ఆయన నిరంతరము ధ్యానం చేస్తున్నారు అన్నది అర్థమైంది. ఇలా నిరంతర ధ్యానమే క్రియాశక్తి.

ప్రకృతిలో ఏ శక్తులు ఉన్నాయో అన్నీ అందరిలోనూ ఉన్నాయి. నిరంతరము ఆత్మను తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే క్రియాశక్తి. అది ఒక్కసారి చేసి ఒకసారి వదిలేది కాదు. మీరు భగవంతుడి గురించి ఎంతగా తపిస్తారో ఆయన వాళ్ళకి అంత దగ్గర అవుతాడు. ఆ ప్రయత్నమే క్రియాశక్తి.

**3. జ్ఞానశక్తి :**

మరి నీ ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి ఎంత తీవ్రంగా ఉంటాయో అంటే భగవంతుడి మీద నీకు ఇష్టం ఎంత తీవ్రంగా ఉంటుందో, ఆయన్ని చేరుకోవడానికి నువ్వు చేసే సాధన ఎంత తీవ్రంగా ఉంటుందో దాన్ని బట్టే నీకు జ్ఞానం వస్తుంది.

మరి గురువు ఎలా వస్తాడో కూడా అర్థం కాని వాళ్లు గురువు చెప్పిన ధ్యానం కాకుండా రకరకాల ధ్యానాలు చేయొచ్చు. కానీ గురువుని దైవ ప్రసాదంగా భావించినప్పుడు, ఆ దైవమే ఒక దూతగా మన దగ్గరికి గురువును పంపాడు అని అర్థమైనప్పుడు, గురువు చెప్పిన ధ్యానమే చేస్తారు.

గురువే అర్థం కానప్పుడు, భగవంతుడే అర్థం కానప్పుడు రాక్షస మనస్తత్వంతో ఉన్నవారు నేనే గొప్ప అని అనుకుంటారు. మరి హిరణ్యకస్యపుడు విష్ణుమూర్తి దైవం కాదు, నేనే దైవం అని ప్రతి చోట ఆయన విగ్రహమే పెట్టుకున్నాడు. గురువే దైవం అనుకున్నప్పుడు గురువు చెప్పిందే మనం చేయాలి.

అలా గురువు ఇచ్చిన సాధనే మనం చేస్తే ఆ జ్ఞానం పెరుగుతూ ఉంటుంది. ఆ జ్ఞానం పెరిగినప్పుడే, జ్ఞానశక్తి పెరిగినప్పుడే పరమాత్మ దర్శనం కలుగుతుంది. జ్ఞానశక్తి పెరిగింది అనటానికి గుర్తు ఏమిటంటే? సర్వజీవులు ఆత్మ స్వరూపులే అని అనడం కాదు, అనుభవంలో ఉండాలి, ఆచరణలో ఉండాలి.

ఈ మూడు శక్తులు ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి ఇవన్నీ ప్రకృతిలోనూ ఉన్నాయి. మనలోనూ ఉన్నాయి. ఎందుకంటే ప్రకృతిలో ఉన్న పంచభూతాలే మన శరీరంలో ఉన్నాయి. మనం గమనిస్తే నాకు ఇది ఇష్టం, అది ఇష్టం అంటున్నాం.

ఉదా: ఇప్పుడు ఎవరికైనా కలెక్టర్ అవ్వాలని ఇచ్ఛ ఉంది, నాకు అది ఇష్టము అని అనుకున్నప్పుడు తీవ్రాతి తీవ్రంగా చదువుతున్నారు. అది క్రియాశక్తి. ఈ రెండు ఉన్నప్పుడు అంటే నువ్వు దాన్ని ఇష్టపడి దాని కోసం ప్రయత్నం చేసినప్పుడు నీకు ఆ పుస్తకాల్లోవన్నీ వంటపడతాయి. అప్పుడు పరీక్ష చక్కగా రాస్తాం. అది జ్ఞానశక్తి.

ప్రాపంచిక జీవితంలో ఆ మూడు చూస్తున్న మనము ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చాక ఆత్మే భగవంతుడు సర్వత్రా ఉన్నది ఆయనే అని తెలుసుకున్నప్పుడు ఆయన మీద తీవ్రాతి తీవ్రమైన ఇష్టం పెంచుకున్నప్పుడు దాన్నే భక్తి అంటారు. నీకు అంత భక్తి ఉన్నప్పుడు భగవంతుడే నీకు ఒక గురువు రూపంలో రావచ్చు.

ఆయన ఇచ్చిన సాధన నువ్వు నిరంతరం చేస్తే, భగవంతుడి గురించి శోధన చేస్తే, నీకు వచ్చేది జ్ఞానం ఏమిటంటే? నేను ఆత్మని, సృష్టి అంతా ఆత్మమయమే, సర్వ జీవులలోనీ ఉన్నది ఆయనే అనే అనుభూతి కలుగుతుంది. అలా కలిగిన రోజున మనకి పూర్ణ జ్ఞానం వచ్చినట్లే.

అలా కాక భగవత్ పారాయణాలు చేస్తే అంటే గీతా పారాయణం, లలితా పారాయణం చేస్తే కొన్ని విషయాలు అర్థమవ్వచ్చు అంతే. లలితా పారాయణం చేస్తున్నారు. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి స్వరూపుణి అన్నారు. మరి ఇక్కడ అనుభవం నీకేం నేర్పింది అంటే? ఇక్కడ అనుభవమూ లేదు, నేర్పడం అంతకంటే లేదు. కానీ ధ్యానం ఏం నేర్పుతుంది? జ్ఞానం ఏం నేర్పుతుంది అంటే నీ శరీరంలో ఉన్న లలితా శక్తి ఎక్కడ ఉంది? ఎక్కడి వరకు వెళ్ళాలి అనేది నేర్పుతుంది.

నీ అనుభూతి నీకు తెలిస్తే కదా ప్రయత్నం చేస్తావు. అమ్మ గురించి

గుణాలు తెలుసుకున్నావు, కానీ అమ్మ ఎక్కడుంది? అమ్మని ఎలా దర్శించాలి? అమ్మని చక్రాలన్నీ దాటించి సహస్రారం లోకి ఎట్లా తీసుకెళ్ళాలి? అన్నది తెలియాలి అంటే గురువు ఇచ్చిన సాధన చేయాల్సిందే. సాధన అంటే మనం స్వయంగా సంపాదించే ధనం.

ఈ ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి అనే మూడు ప్రయత్నాలు లేకుండా ఊరికే పుస్తకాలు చదివేస్తే, పారాయణాలు చేస్తే ఆత్మ దర్శనం కాదు, పరమాత్మని ఎప్పటికీ తెలుసుకోలేరు. సాధన చేసి ఈ మూడు శక్తుల్ని పెంచుకుంటూ ఉంటే అప్పుడు పరమాత్మ దర్శనం కలుగుతుంది. పుస్తకాలు చదివిన వాళ్ళందరికీ ఆత్మ దర్శనం అయిపోయే అంత చీప్గా లేడు భగవంతుడు. వ్యక్తమైన రూపంలో నీకున్నా, నీకు అనుభూతే తెలియట్లేదు.

ఈ మొక్క నేను వేస్తున్నాను అనుకుంటున్నావు కానీ ఒక మొక్క పెరగాలన్నా, ఒక జీవి బ్రతకాలన్నా ఆ పరమాత్మ యొక్క చైతన్యంతోనే బ్రతుకుతున్నాయి. ఈ సృష్టి అంతా ఆయన చైతన్యంతోనే నడుస్తుంది. వ్యక్తమైన రూపం అంటే కనిపిస్తున్న ప్రపంచం. దాంట్లోనే భగవంతుడి శక్తి ఉందని మనకు తెలియదు. ఎంతో అజ్ఞానంలో కూరుకుపోయాము.

ఇలా ఒక్కొక్క విషయం తెలుసుకున్నప్పుడు పత్రిగారు మనకి ఎంతటి జ్ఞానాన్ని ఇచ్చి వెళ్ళారు. ఎంతటి సూక్ష్మాతి సూక్ష్మమైన దృష్టిని మనకి అలవాటు చేశారో మనకి మనం విచారణ చేసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. నిజం చెప్పాలంటే నా దృష్టిలో ఇది ఎలా ఉంటుందంటే? ప్రాపంచిక చదువులన్నీ ఒక ఎల్.కె.జి.తో సమానం అయితే, ఆధ్యాత్మిక చదువులు ఒక పి.హెచ్.డి లాంటివి. ఎల్.కె.జి. చదవకపోతే పి.హెచ్.డి పుస్తకాలు చదవలేం.

అందుకనే ప్రపంచంలో ఉంటూ, ప్రపంచాన్ని చూస్తూ, భౌతిక జీవితంలో దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో అలా ఉపయోగించుకోవాలి. మరి సాధన కోసం శరీరం తెచ్చుకున్నాం కాబట్టి శరీరానికి కావలసినవన్నీ ప్రాపంచికంలో నుంచే రావాలి అని అర్థమయ్యాక దాన్ని ఉపయోగించుకుంటూ మరి శ్వాస మీద ధ్యాస పెట్టి అంతర్ ప్రయాణం చేస్తున్నప్పుడు మనకి అద్భుతాలు

సృష్టించగలిగే శక్తి వస్తుంది.

గమనిస్తే మరి బాహ్య శరీరానికి బలం ఒకటే ఉంది. కానీ అంతరంలో అనంతమైన శక్తి దాగి ఉంది. ఆ అనంతమైన శక్తిని వెలికి తీసే మార్గమే ధ్యానం అని చెప్తారు.

మరి ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి మూడు శక్తులు కలిస్తేనే ఆత్మ దర్శనం కలుగుతుంది. నువ్వు కోరుకున్న సంకల్పాలన్నీ నెరవేరుతాయి. నీ సంకల్పాలు నెరవేరాలి అంటే ఆత్మని దర్శించాలి. ఆత్మని దర్శించాలి అంటే ఈ మూడు శక్తులు ఉండాలి. భగవంతుడ్ని తెలుసుకోవాలనే కోరిక ఉండాలి అదే ఇచ్ఛా శక్తి, దానికి గురువు ఇచ్చిన ధ్యానం చేయాలి అదే క్రియాశక్తి. ఈ రెండు కలిస్తే సర్వత్రా ఉన్నది పరమాత్మే, సర్వజీవుల లోనూ ఉన్నది పరమాత్మే, అందరిలో ఉన్నది ఆయనే అనే జ్ఞానం వస్తుంది అదే జ్ఞానశక్తి.

ఈ మూడు మనకి ఎప్పుడైతే కలుగుతాయో అప్పుడు మనకి ఆత్మ దర్శనం కలుగుతుంది. మరి అప్పుడు మనం ఏది అనుకుంటే అది చేయ గలుగుతాం. మనకి లలితా సహస్రం చదువుతున్నప్పుడు ఈ మూడు పదాలు వచ్చినప్పుడు, ఈ మూడు శక్తులు అమ్మ దగ్గర ఉన్నాయేమో! ఆవిడకి ఎంతగా పారాయణం చేసి, ఎన్ని ప్రసాదాలు చేస్తే అంతగా ఆ మూడు శక్తులు మనకి ఇస్తుందేమో అని అపోహ ఉంటుంది.

నేను కూడా అలాగే అనుకునేదాన్ని. కానీ ఈ ధ్యాన మార్గంలోకి వచ్చాక ఈ మూడు శక్తులు అందరిలోనూ నిక్షిప్తమై ఉన్నాయి. ఆత్మే భగవంతుడు, ఆ భగవంతుడ్ని తెలుసుకునే మార్గమే ధ్యానం, ఆ ధ్యానం చేస్తే వచ్చేది జ్ఞానం అని అర్థమైంది. ఆవిడ చెప్పింది అంతర్ముఖ సమారాధ్య అని కానీ మనకి అర్థం అవ్వక బయట వెతికాం.

గురువు వచ్చాక ఆత్మే భగవంతుడు అనే థియరీ ఇచ్చాడు. అలాగే శ్వాస మీద ధ్యాస ధ్యానం ద్వారానే ఉన్న ఆత్మని దర్శించగలము. అది ప్రాక్టికల్ నాలెడ్జ్. నువ్వే దేవుడవని రకరకాలుగా మనకి చెప్పినా ఎప్పుడైతే ధ్యానం చేస్తున్నామో మనకి ఆ అనుభవం ఇంకా రాకపోయినా, అనుభూతి మాత్రం

తెలుస్తుంది.

ఎందుకంటే ధ్యానానికి రాకముందు ఎలా ఉన్నాము? ధ్యానానికి వచ్చాక ఎటువంటి మార్పులు జరుగుతున్నాయో మనకు అర్థమైనప్పుడు, కరెక్టే మనం భగవంతుడి వైపు దృష్టి పెట్టలేదు కాబట్టే ఏమీ తెలియలేదు. ఇప్పుడు మనం ఆత్మ అనే భగవంతుడి మీద శ్వాస మీద ధ్యాస ధ్యానంతో దృష్టి పెట్టాం కాబట్టే ఇప్పుడు కొద్ది కొద్దిగా జ్ఞానం పెరుగుతోంది అని అర్థమవుతుంది.

ఇది ఎంత తీవ్రంగా ఉంటుందో అంతగా ఆత్మకు దగ్గరై మరి ఆత్మ దర్శనం పొందడానికి అర్హత సంపాదిస్తాం. అప్పుడు మనం ఏదనుకుంటే అది చేయగలిగే శక్తి మనకి వస్తుంది. మరి ప్రతి ఒక్కరూ ఈ ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి పెంచుకోవాల్సిందే. దానికి మార్గమే శ్వాస మీద ధ్యాస.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
40) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
41) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
42) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
43) అతీంద్రియ శక్తులు - రూ.60/-
44) ఆలోచించండి - రూ.60/-
45) నిర్వాణ మార్గం - రూ.60/-
46) ధ్యానులకు సూచనలు - రూ.60/-
47) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
48) సంకల్పమంటే? - రూ.50/-
49) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
50) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
51) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
52) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
53) బ్రహ్మం అంటే? -రూ.40/-
54) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం-రూ.40/-
55) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
56) మహాత్ముల సందేశాలు - రూ.40/-
57) సత్యం - రూ.40/-
58) చక్రాలు - రూ.40/-
59) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
60) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
61) మౌన ధ్యానం - రూ.40/-
62) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
63) శాకాహారమే మానవాహారం - రూ.15/-
64) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



మానవుడికి జ్ఞానం పెరగకుండా ఆపేవి మనసుకున్న మూడు దోషాలు అని మీకు ఉత్తరగీతలో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

1) మల దోషం, 2) విక్షేపణ దోషం, 3) ఆవరణ దోషం.

ఈ మూడు దోషాల వల్లే విన్నా ఆచరణలో పెట్టుకోబుద్ధి కాదు, వాళ్ళకి జ్ఞానం పెరగదు, సాధన చేయలేకపోతూ ఉంటారు.

ఎక్కువ సాధన చేస్తూ.. వేదాంత విషయాల మీద ఆశక్తి పెంచుకుంటూ, పాపకర్మలు మాని, పుణ్య కర్మలు నిష్కామంగా చేస్తూ ఉన్నప్పుడు మల దోషాన్ని ఈ జన్మలోనే తొలగించుకోవచ్చు అని శ్రీ కృష్ణుడు ఉత్తరగీతలో చెప్పడం జరిగింది.

సాధకుడు గురువు చెప్పిన విషయాల మీద నమ్మకము, విశ్వాసము ఉంచి ఆచరణలో పెట్టుకోవాలి. అప్పుడే నిశ్చలమైన మనసుతో సాధన చక్కగా చేయగలడు. విక్షేపణ దోషాన్ని తొలగించుకోగలడు.

ఎప్పుడైతే గురువు ద్వారా విని శ్రవణం చేసి పదేపదే మననం చేసుకుంటారో అప్పుడు భూమ్మీద నిత్యమైనవేంటి? అనిత్యమైనవేంటి? సత్యమైనది ఏంటి? అసత్యం ఏంటి? అన్నది తెలుసుకున్న రోజున పంచ కోశాలు నేను కాదు నేను ఆత్మని అని అర్థమవుతుంది. ఆవరణ దోషాన్ని తొలగించుకోగలడు.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-